విశాల భారతి
తెలుగు దినపత్రిక
16-05-2026
www.vishalabharati.com
epaper.vishalabharati.com
శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 132

# జూన్ 21న నీట్ రీఎగ్జామ్

- పాత పరీక్ష ఫీజును విద్యార్థులకు వాపస్
- మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు
- గతంలో కేటాయించిన పరీక్షా కేంద్రాలే ఉంటాయి
- పేపర్ లీక్ ఆరోపణలతో మే 3 పరీక్ష రద్దు
- ఎన్‌టీఏ వెబ్‌సైట్‌నే అనుసరించాలి

03



పొదుపు చెప్పి 5 దేశాల పర్యటనకు వెళ్లడంపై విమర్శలు

# జనానికే పొదుపు సుద్దులు..!

## ఇంధనం, బంగారం, విదేశీ ప్రయాణాలు తగ్గించాలని ప్రధాని పిలుపు



- ప్రజలకు పొదుపు చెప్పి పాలకులు విమానాల్లో తిరగడంపై ఆగ్రహం
- ప్రత్యేక విమానాలు వద్దని నిర్ణయించి, మళ్లీ అవే వాడటం
- కేబినెట్ నిర్ణయాలను మంత్రులే భేఖాతర్ చేయడంపై చర్చ
- పొదుపు సూత్రాలు పాలకులకు వర్తించవా అని సామాన్యుల ప్రశ్న

**పశ్చిమాసియా యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కాకుండా విదేశీ మారక నిల్వలను కాపాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. చమురు దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు ప్రజలు ఇంధన పొదుపు పాటించాలని, విలాసవంతమైన బంగారం కొనుగోళ్లు ఆపేయాలని, విదేశీ పర్యటనలు వాయిదా వేసుకోవాలని సూచించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతి పైసా కీలకమని సెలవిచ్చిన పెద్దాయన, ఇప్పుడు తానే స్వయంగా ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనకు విమానం ఎక్కడం పెను చర్చకు దారితీసింది. సామాన్యుడిని సైకిల్ తొక్కమనే పాలకులు, తాము మాత్రం విలాసవంతమైన జెట్ విమానాల్లో విదేశాలు చుట్టిరావడం ఏ రకమైన నీతి అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు.**

**విశాలభారతి, జాతీయం:** మే 15 నుండి మే 20 వరకు సాగే ఈ ఆరు రోజుల విదేశీ యాత్రలో భాగంగా మోదీ యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో అడుగుపెట్టనున్నారు. రక్షణ, వాణిజ్య ఒప్పందాల కోసమే ఈ పర్యటన అని విదేశాంగ శాఖ సమర్థించుకుంటున్నా, ప్రజల్లో మాత్రం అసహనం వ్యక్తమవుతోంది. చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ సమయంలో విమాన ఇంధనానికి అయ్యే ఖర్చు అక్షరాలా రూ. 25 కోట్ల పైమాటేనని అంచనా. ఒకవైపు దేశీయంగా 140 కోట్ల మందిని పొదుపు మంత్రం జపించమంటూ, మరోవైపు ప్రభుత్వ ఖజానా నుండి కోట్లాది రూపాయలను ఇలాంటి విదేశీ పర్యటనలకు వెచ్చించడం ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతోంది. మోదీ చెప్పిన పొదుపు సూత్రాలు

మిగతా 4లో..

# 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా

## రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

- పదేళ్లు తెలంగాణాలోనే ఉండి సేవలందిస్తా
- హైకమాండ్‌తో తనకు మంచి చొరవ ఉంది
- పార్టీలు మారినా బాబుతో గౌరవప్రదమైన సంబంధాలు
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలి
- ప్రజలు ఇప్పుడు "స్విగ్గీ పాలిటిక్స్" కోరుకుంటున్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వేదికగా శుక్రవారం నిర్వహించిన భేటీలో తన రాజకీయ ప్రస్థానం, భవిష్యత్ ప్రణాళికలపై అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబానికి ఈ దేశం పట్ల ఉన్న అంకితభావం అపారమని ఆయన కొనియాడారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో తనకు ఉన్న సాన్నిహిత్యం కేవలం రాజకీయ పరమైనది మాత్రమే కాదని, అది ఒక బలమైన నమ్మకమని పేర్కొన్నారు. అధిష్టానం వద్ద తనకు పూర్తి చొరవ ఉన్నప్పటికీ, తన పరిధులు తనకు తెలుసని, ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటనని స్పష్టం చేశారు. పార్టీలో తనకంటూ

మిగతా 3లో..

# హైదరాబాద్‌కు హైస్పీడ్ హంగులు

- హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నైలకు హైస్పీడ్ రైళ్లు
- 671 కి.మీ. మార్గానికి సిద్ధమైన ప్రాజెక్టు నివేదిక
- రాష్ట్రంలో సుమారు 216 కి.మీ. మేర భూసేకరణకు ఆదేశం
- కోకాపేట, శంషాబాద్‌లలో డిపోల ఏర్పాటుకు స్థల పరిశీలన
- రైల్వే, హెచ్ఎండీఏ అధికారులతో సీఎస్ కీలక సమీక్ష
- రవాణా వేగం పెంచి రాష్ట్ర ఆర్థిక వృద్ధిని సాధించడం

03





# బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

- ఓటర్ల సవరణ ప్రక్రియను 2 ఏళ్ల వరకు పొడిగించాలి
- ప్రతి ఇంటిని 3 సార్లు సందర్శించి జియో-ట్యాగ్ చేయాలి
- ఓటు తొలగించే ముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలి
- పాత, కొత్త జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయాలి
- బడుగు బలహీన వర్గాల ఓట్లు గల్లంతవ్వకుండా చూడాలి

02

# టిమ్స్ కేసీఆర్ కల

- పేదలకు ప్రపంచస్థాయి చికిత్స అందించడమే లక్ష్యం
- ఒక్కో ఆసుపత్రిని అత్యాధునిక హంగులతో నిర్మించారు
- పెండింగ్‌లో ఉన్న టిమ్స్ పనులను ప్రభుత్వం వెంటనే ముగించాలి
- 16 ఆపరేషన్ థియేటర్లు, 300 ఐసీయూ బెడ్లు, రీసెర్చ్ సెంటర్లు
- ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు కేసీఆర్ విజన్
- రోగుల సహాయకుల కోసం ప్రత్యేకంగా ధర్మశాలల నిర్మాణం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఆరోగ్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయాలనే బలమైన సంకల్పంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం అడుగులు వేసింది. సామాన్యుడికి కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షలా మారకూడదనే ఉద్దేశంతో హైదరాబాద్ నలుదిశలా టిమ్స్ ఆసుపత్రులకు అంకురార్పణ జరిగింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. శుక్రవారం నాడు సనత్‌నగర్ ప్రాంతంలోని టిమ్స్ నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆసుపత్రి ప్రాంగణమంతా కలియతిరుగుతూ అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను నిశితంగా గమనించారు.

మిగతా 2లో..



# ఒక్కసారి గెలిస్తే ఇంకెప్పుడూ ఓడిపోం

- తెలంగాణలో అధికారం దక్కించుకోవడమే లక్ష్యం
- ఏ పార్టీతోనూ పొత్తుల్లేవు, 119 సీట్లలో పోటీ
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం

03

# నల్లగొండలో హరీశ్ సీక్రెట్ ఆపరేషన్

- జగదీశ్ రెడ్డి ఆధిపత్యంపై జిల్లా సొంత పార్టీ నేతల అసంతృప్తి
- జగదీశ్ వ్యతిరేక వర్గంతో హరీశ్ రావు వరుస భేటీలు
- కోదాడ, నకిరేకల్, సాగర్ మాజీ ఎమ్మెల్యేలు హరీష్ చెంతకు
- కోదాడ మీటింగ్‌లో జగదీశ్ ఫోటోలు తీసేయడం తీవ్ర చర్చనీయాంశం
- జిల్లా వేదికగా కేటీఆర్ వర్సెస్ హరీశ్ రావు గ్రూపుల విభేదాలు
- గాదరి కిషోర్ లాంటి నేతలు దూరంగా ఉండటంతో లీకైన అసమ్మతి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ రాజకీయాల్లో గత పదేండ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. జిల్లా వ్యాప్తంగా గులాబీ దళాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కోటలోనే ఇప్పుడు సొంత పార్టీ నేతలు తిరుగుబాటు జెండా ఎగురవేస్తుండటం తీవ్ర సంచలనం రేపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాల స్థాయిలో స్థానిక నాయకత్వాల

మిగతా 2లో..



# రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం

- మార్పు కోసం 'తెలంగాణ రక్షణ సేన' ఏర్పాటు; అన్ని చోట్లా పోటీ
- ఉద్యమ కేసీఆర్ ఇష్టం, కానీ బీఆర్ఎస్ అధినేతతోనే సమస్యలు
- రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం; బండి సంజయ్‌ను మంత్రిగా తప్పించాలి
- లిక్కర్ స్కామ్ కష్టాల్లో అత్తగారి ఇల్లే అండగా నిలిచింది
- యువతను ఓనర్లుగా మార్చేందుకు రూ. 20 కోట్ల వరకు రుణాలు
- చరిత్రలో నిలిచిపోయేలా ప్రజలకు మర్చిపోలేనంత మంచి చేయడం

04



# నల్లగొండలో హరీశ్ సీక్రెట్ ఆపరేషన్



**మొదటిపేజీ తరువాయి**

మధ్య పెరిగిన దూరం ఇప్పుడు వీధిన పడింది. శాసనసభ ఎన్నికల అనంతర పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్ తీవ్ర నైరాశ్యంలో ఉన్న తరుణంలో ఈ అసంతృప్తి జ్వాలలు మరింత విస్తరించడం గమనార్హం. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మాజీ మంత్రి హరీశ్ రావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరుసగా జరుపుతున్న పర్యటనలు సరికొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తున్నాయి. జగదీశ్ రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న కీలక వర్గంతో హరీశ్ రావు అత్యంత రహస్యంగా మంతనాలు సాగించడం జిల్లా రాజకీయాల్లో పెను తుఫానుకు సంకేతంగా మారుతోంది. ఆపరేషన్ హరీశ్ పేరిట సాగుతున్న ఈ వ్యూహాత్మక అడుగులు కేవలం పార్టీ సంస్థాగత బలోపేతం కోసమేనా లేక జిల్లాలో ఒక ప్రధాన నాయకత్వ మార్పునకు నాంది పలకడానికా అన్న తీవ్ర చర్చ పార్టీ శ్రేణుల్లో ముమ్మరంగా సాగుతోంది. ఈ అంతర్గత పోరు రాబోయే రోజుల్లో పార్టీ ఉనికిని ఏ విధంగా ప్రభావితం చేస్తుందోనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి కొంతమంది మాజీ ఎమ్మెల్యేలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఘర్షణ వాతావరణం నెలకొంది. సరిగ్గా ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని జగదీశ్ రెడ్డి వ్యతిరేక వర్గాన్ని హరీశ్ రావు తన అక్కున చేర్చుకోవడం జిల్లా వ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశంగా మారింది. గత పదేండ్లుగా జిల్లాలో ఎదురులేని శక్తిగా నిలిచిన ఒక అగ్రనేతకు సొంత పార్టీలోని సహచరుల నుంచే ఈ స్థాయిలో వ్యతిరేకత ఎదురుకావడం ఇదే మొదటిసారి. ఈ ఆధిపత్య పోరు చివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గులాబీ పార్టీ పట్టును పూర్తిగా సడలించే ప్రమాదం ఉందని సీనియర్ నేతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ప్రధాన నియోజకవర్గాల్లో జగదీశ్ రెడ్డి తన వ్యక్తిగత ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ తమకు సమాంతరంగా ప్రత్యర్థి వర్గాలను ప్రోత్సహిస్తున్నారనే ఆగ్రహం మాజీ ఎమ్మెల్యేలలో బలంగా ఉంది. ముఖ్యంగా నాగార్జున సాగర్ పరిధిలో కోటిరెడ్డిని రంగంలోకి దించడం నకిరేకల్ అలాగే కోదాడ నియోజకవర్గాలలో ఇతర ప్రత్యామ్నాయ నేతలను తెరపైకి తీసుకురావడం స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులకు మింగుడుపడటం లేదు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఎన్నోసార్లు అధిష్టానం వద్ద మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమైంది. దీంతో జగదీశ్ రెడ్డి కట్టడి చేయగల ఏకైక సమర్థుడైన నాయకుడు హరీశ్ రావు మాత్రమేనని నమ్మి వారంతా ఆయన చెంతకు చేరుతున్నారు. ఈ క్రమంలోనే కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నకిరేకల్ మాజీ ప్రతినిధి చిరుమర్తి లింగయ్య నాగార్జున సాగర్ నేత నోముల భగత్ వంటి వారి నియోజకవర్గాలపై హరీశ్ రావు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇటీవల కోదాడ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన పార్టీ అధికారిక సమావేశంలో కనీసం జగదీశ్ రెడ్డి చిత్రపటాన్ని కూడా ఉంచకపోవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. అది కేవలం నిర్వాహకుల పొరపాటు కాదని ఒక స్పష్టమైన వ్యూహాత్మక సంకేతమని రాజకీయ విశ్లేషకులు ఘంటాపథంగా చెప్తున్నారు. ఈ సంఘటన జిల్లాలో జగదీశ్ రెడ్డి పట్టు ఏ మేరకు సడలిందో చెప్పడానికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తోంది. ఉద్యమ కాలం నాటి నుండి గులాబీ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు అత్యంత విశ్వాసపాత్రుడిగా పేరుపొందిన జగదీశ్ రెడ్డికి తాజా రాజకీయ పరిణామాలు ఒక పెద్ద గండంగా మారాయి. గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి వంటి హేమాహేమీలు ఉమ్మడి జిల్లా రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు జగదీశ్ రెడ్డి విజయవంతంగా అడ్డుకోగలిగారు. అయితే ఇప్పుడు హరీశ్ రావు ఏకంగా నియోజకవర్గాల స్థాయికి వెళ్లి క్షేత్రస్థాయి క్యాడర్‌తో నేరుగా సంబంధాలు ముడి వేస్తుండటం జగదీశ్ రెడ్డి నాయకత్వానికి పెద్ద సవాల్‌గా పరిణమించింది. ఈ సంక్షోభం నుండి ఎలా గట్టెక్కాలో తెలియక ఆయన వర్గం కొట్టుమిట్టాడుతోంది. హరీశ్ రావు తన పర్యటనల ద్వారా జిల్లాలో వేగం పెంచుతున్న వేళ జగదీశ్ రెడ్డి అనుచరవర్గం కూడా అప్రమత్తమైంది. వారు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ద్వారా తమ పూర్వపు పట్టును జిల్లాలో నిలుపుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ మొత్తం ఉదంతం వల్ల పార్టీలో స్పష్టంగా కేటీఆర్ వర్గం హరీశ్ రావు వర్గం అనే నిలువు చీలిక నల్లగొండ జిల్లా వేదికగా బహిర్గతమవుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 65 శాతానికి పైగా ఉన్న పార్టీ సానుభూతిపరులు ఈ పరిణామాలను గమనిస్తూ అయోమయంలో పడ్డారు. అగ్ర నాయకుల మధ్య నెలకొన్న ఈ తీవ్ర ఈర్ష్యాద్వేషాలు పార్టీ పునాదులను కదిలిస్తాయని శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం ఒక అగ్రనేత రావడం మంచిదేనని కొందరు దిగువ స్థాయి కార్యకర్తలు భావిస్తున్నప్పటికీ అంతర్గత ఘర్షణలు తెచ్చే నష్టాన్ని సీనియర్లు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ వంటి జగదీశ్ రెడ్డి నమ్మకస్తులు హరీశ్ రావు నేతృత్వంలో జరుగుతున్న అధికారిక మీటింగ్‌లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. దాదాపు 3 నియోజకవర్గాల పరిధిలో ఈ గైర్హాజరీ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామం పార్టీలోని అంతర్గత విభేదాల తీవ్రతకు అద్దం పడుతోంది. ఎవరి దారి వారిదే అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారం సాధారణ కార్యకర్తలకు దిక్కుతోచని స్థితిని కల్పిస్తోంది. మరోవైపు ఆలేరు నియోజకవర్గంలో గొంగడి సునీత వర్గం హరీశ్ రావుకు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలవడం జిల్లాలో రాజకీయ సమీకరణాలను శరవేగంగా మార్చేస్తోంది. నల్లగొండ బీఆర్ఎస్ లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం సాధారణ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు మాత్రమే కావు. ఇది ఖచ్చితంగా ఒక భారీ స్థాయి నాయకత్వ మార్పునకు ఆధిపత్య పోరుకు సంబంధించిన వ్యూహాత్మక భాగమేనని స్పష్టమవుతోంది. జిల్లాలో జగదీశ్ రెడ్డి లాంటి బలమైన నేతను పక్కన పెట్టి హరీశ్ రావు ఇంతలా స్వతంత్రంగా అడుగులు వేయడం వెనుక అధినేత మౌన సమ్మతి ఉందా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. లేక ఇది హరీశ్ రావు సొంతంగా పన్నుతున్న రాజకీయ వ్యూహమా అనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. ఏది ఏమైనా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా హరీశ్ రావు రాజేసిన ఈ అసంతృప్తి మంటలు జగదీశ్ రెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రాబల్యానికి ఒక కఠినమైన పరీక్షగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో జిల్లాలోని మొత్తం 12 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను శాసించిన ఒక మహానాయకుడు ఇప్పుడు తన సొంత ఇలాకాలోనే రక్షణ కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. తెలంగాణ రాజకీయ క్షేత్రంలో నల్లగొండ జిల్లాకు ఒక ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. ఇక్కడి అంతర్గత ఘర్షణల ప్రభావం పక్కనే ఉన్న ఖమ్మం వరంగల్ జిల్లాలపై కూడా పడే అవకాశం లేకపోలేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి ఈ వర్గపోరు మరింత పతాక స్థాయికి చేరితే పార్టీకి భారీ నష్టం వాటిల్లడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదర్చకపోతే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గులాబీ కోట పూర్తిగా కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందని పార్టీ మేధావులు హెచ్చరిస్తున్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో ఆర్మీ జవాన్ అరెస్ట్



**విశాలభారతి, నేరేడ్‌మెట్ :** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసును నేరేడ్‌మెట్ పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి ఆర్మీలో జనరల్ డ్యూటీ జవాన్‌గా పనిచేస్తుండటం సంచలనంగా మారింది. అతడి వద్ద నుంచి మూడు తులాల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మీడియా సమావేశంలో ఏసీపీ వి. యాదగిరి రెడ్డి వివరాలు వెల్లడించారు. ఏపీ కడప జిల్లాకు చెందిన కుర్రపోతుల రెడ్డిశేఖర్ (31)ప్రస్తుతం అల్వాల్‌లోని త్రిశూల్ లైన్ ఆర్మీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల్లో కూరుకుపోయాడు. అప్పులు తీర్చేందుకు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. 10వ తేదీ సాయంత్రం తన నల్లరంగు బజాజ్ పల్సర్ బైక్‌పై బయటకు వచ్చిన నిందితుడు ముందుగా డాల్ఫిన్ వైన్ షాపు సమీపంలోని ఓ పాన్ షాప్ వద్ద ఆగాడు. అనంతరం సీసీ కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు తన బైక్ నంబర్ ప్లేట్‌ను మార్చి నకిలీ స్టిక్కర్ అమర్చుకున్నాడు. తర్వాత సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న జొన్నగడ్డ యోగేందర్ మణి మేఘల (57)ను లక్ష్యంగా చేసుకుని ఆమెను అడ్రస్ అడిగినట్లు నటించి మెడలో ఉన్న మూడు తులాల నల్లపూసల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు ఈనెల 13వ తేది రాత్రి అల్వాల్‌లోని డాల్ఫిన్ వైన్ షాప్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు ఛేదనలో మల్కాజిగిరి జోన్ డీసీపీ శ్రీధర్,ఏసీపీ వి. యాదగిరి రెడ్డి , నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ పి. సందీప్‌కుమార్, ఎస్ఐ జి. చంద్రశేఖర్ , అవినాష్‌తో పాటు క్రైమ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు



- ఓటర్ల సవరణ ప్రక్రియను 2 ఏళ్ల వరకు పొడిగించాలి
- ప్రతి ఇంటిని 3 సార్లు సందర్శించి జియో-ట్యాగ్ చేయాలి
- ఓటు తొలగించే ముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలి
- పాత, కొత్త జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయాలి
- బడుగు బలహీన వర్గాల ఓట్లు గల్లంతవ్వకుండా చూడాలి
- ఓటర్ల సవరణకు, జనాభా గణనకు వేర్వేరు బృందాలను వాడాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సర్ ప్రక్రియ ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ ఈ వ్యవహారంపై అత్యంత దూకుడుగా స్పందిస్తూ ఎన్నికల సంఘం తీరును తూర్పారబట్టారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలతో పాటు 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ షెడ్యూల్ విడుదలైన తరుణంలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. శుక్రవారం నాడు గాంధీ భవన్ నుంచి బయలుదేరిన ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి క్షేత్రస్థాయి వాస్తవాలను వివరించింది. ప్రజాస్వామ్య పునాదులను కదిలించేలా సాగుతున్న ఈ ప్రక్రియలో అనేక లోపాలున్నాయని వారు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. మహేష్‌కుమార్ గౌడ్ మీడియా ముందు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థలోని లోపాలను ఎండగట్టారు. గతంలో జరిగిన బెంగాల్ ఎన్నికల ఉదంతాలను ప్రస్తావిస్తూ పారదర్శకత అనేది గాలిలో దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ గడ్డపై బీజేపీ అగ్రనేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి విజయం వెనుక 'దొంగ ఓట్ల' హస్తం ఉందంటూ ఆయన చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో తక్షణ ఎన్నికల వేడి లేనందున ఈ సవరణ ప్రక్రియను హడావిడిగా ముగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన అనేది ఏడాది పొడవునా సాగే ఒక నిరంతర, పారదర్శక ప్రక్రియగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. గత 25 ఏళ్ల కాలాన్ని విశ్లేషిస్తే ఓటర్ల సంఖ్యలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. ఈ భారీ డేటాను కేవలం కొన్ని నెలల్లోనే సరిదిద్దడం అసాధ్యమని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ఈ ప్రక్రియను కనీసం 1.5 ఏళ్ల నుండి 2 ఏళ్ల వరకు పొడిగించి దశలవారీగా చేపట్టాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు మొక్కుబడిగా కాకుండా జియోట్యాగ్ ఫొటోలతో డిజిటల్ సాక్ష్యాలను సేకరించాలి. ప్రతి ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించి భౌతిక ధృవీకరణ పూర్తి చేసినప్పుడే జాబితాలో నాణ్యత పెరుగుతుంది. టెక్నాలజీని వాడుకుంటూనే క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించుకోవడం అత్యంత ఆవశ్యకమని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం, దానిని తొలగించే విషయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎవరి ఓటునైనా తొలగించాలనుకుంటే సదరు వ్యక్తికి 7 రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు ఇవ్వడం తప్పనిసరి. అభ్యంతరాలు తెలియజేయడానికి కనీసం 30 రోజుల సమయం కల్పించాలి. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఈ విషయంలో పక్షపాత ధోరణి ప్రదర్శిస్తే సహించే ప్రసక్తే లేదని, చట్టపరమైన పోరాటానికి వెనుకాడబోమని ఆయన తేల్చి చెప్పారు. ఓటరుకు తన హక్కును కాపాడుకునే వెసులుబాటు కల్పించడమే ఎన్నికల సంఘం ప్రథమ కర్తవ్యం. రాజకీయ పార్టీలకు డేటా షేరింగ్ విషయంలో పూర్తి సహకారం అందించాలని కాంగ్రెస్ కోరుతోంది. ముఖ్యంగా 2002 నాటి పాత జాబితా, 2025 నాటి తాజా జాబితాలను సాఫ్ట్ కాపీలు, హార్డ్ కాపీల రూపంలో అందజేయాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ASD) కేటగిరీలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పార్టీలకు చేరవేయాలి. ఇలా చేయడం వల్ల రాజకీయ పక్షాలు కూడా ఓటర్ల ధృవీకరణలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంటుంది. పారదర్శకత పెరిగినప్పుడే ఎన్నికల వ్యవస్థపై సామాన్యుడికి నమ్మకం కలుగుతుంది. డేటా లీకేజీలకు తావులేకుండా భద్రతా ప్రమాణాలను పాటించాలని వారు సూచిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన ఓట్లు టార్గెటెడ్‌గా గల్లంతవుతున్నాయని వారు అనుమానిస్తున్నారు. ఈ వర్గాల ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. 2002 సంవత్సరం తర్వాత ఉపాధి లేదా ఇతర కారణాల వల్ల రాష్ట్రానికి వలస వచ్చిన వారిని విస్మరించకూడదు. కనీసం 2 సార్లు ఇక్కడ ఓటు వేసిన రికార్డు ఉంటే, అఫిడవిట్ ప్రాతిపదికన వారి ఓటు హక్కును పునరుద్ధరించాలి. బడుగు బలహీన వర్గాల గొంతుకను ఎన్నికల్లో నొక్కేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిది. అధికారులపై పనిభారం తగ్గించేందుకు వినూత్నమైన ప్రతిపాదనను టీపీసీసీ ముందుంచింది. జనాభా గణన పనులు, ఓటర్ల జాబితా సవరణ విధులను వేర్వేరు బృందాల ద్వారా నిర్వహించాలి. ఒకే అధికారికి ఈ రెండు క్లిష్టమైన బాధ్యతలు అప్పగించడం వల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. పని ఒత్తిడిలో తప్పులు దొర్లితే అది లక్షలాది మంది ఓటు హక్కుపై ప్రభావం చూపుతుంది. అందుకే మానవ వనరుల వినియోగంలో శాస్త్రీయతను పాటించాలని వారు కోరారు. నిర్దిష్టమైన విభజన ఉన్నప్పుడే పనులు వేగంగా, నిర్దుష్టంగా సాగుతాయని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఓటరు నమోదు ప్రక్రియలో యువత భాగస్వామ్యం కూడా కీలకంగా మారింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ సులభంగా ఓటు హక్కు లభించేలా నిబంధనలను సరళీకరించాలి. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో జాప్యాన్ని నివారించి తక్షణమే ఓటరు కార్డులు జారీ చేయాలి. కేవలం అంకెల్లో ప్రగతిని చూపించడం కాకుండా, వాస్తవ ఓటర్ల సంఖ్యను శాస్త్రీయంగా లెక్కగట్టాలి. రాజకీయ ప్రయోజనాల కోసం జాబితాలను తారుమారు చేసే శక్తులపై నిఘా ఉంచాలని కాంగ్రెస్ బృందం సీఈఓను కోరింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో ప్రతి అధికారి నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల సంఘం స్వతంత్రతపై వస్తున్న విమర్శలను మహేష్ కుమార్ గౌడ్ గట్టిగా ప్రస్తావించారు. అధికార పార్టీల కనుసన్నల్లో వ్యవస్థలు పనిచేస్తే సామాన్యుడికి న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠినమైన గైడ్‌లైన్స్ అమలు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేల సంఖ్యలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓల పనితీరును ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. డిజిటల్ యుగంలో ఇంకా పాత పద్ధతుల్లోనే గృహ సందర్శనలు చేయడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని వారు విశ్లేషించారు. స్మార్ట్ సర్వేల ద్వారా డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలని వారు ఆశిస్తున్నారు. మొత్తానికి టీపీసీసీ చేసిన ఈ సంచలన ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఓటర్ల జాబితా సవరణ అనేది కేవలం ఒక పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాదు, అది భవిష్యత్తు ప్రభుత్వాలను నిర్ణయించే అత్యంత కీలకమైన అడుగు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ఓటును కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుంది. ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ఈ వినతిపత్రంపై ఎలా స్పందిస్తారో, ఎటువంటి మార్పులు తీసుకువస్తారో వేచి చూడాలి. పారదర్శకత గెలిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

# 'టిమ్స్' కేసీఆర్ కల



**మొదటిపేజీ తరువాయి**

వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలతో ముచ్చటించి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సౌకర్యాలను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేస్తూనే ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శల బాణాలను ఎక్కుపెట్టారు. పేదలకు ఎయిమ్స్ స్థాయి చికిత్సను ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఒక్కో టిమ్స్ ఆసుపత్రికి దాదాపు రూ.1200 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించారు. కేసీఆర్ దార్శనికతతో రూపుదిద్దుకున్న ఈ ఆసుపత్రులు కార్పొరేట్ హస్పిటల్స్ కంటే మిన్నగా ఉండాలని డిజైన్ చేశారు. కేసీఆర్ గనుక అధికారంలో కొనసాగి ఉంటే ఈపాటికే ఈ అద్భుత కట్టడాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేవి. దాదాపు రెండేళ్ల క్రితమే ఈ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ పాలనలో జాప్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజకీయ భేషజాలకు పోకుండా ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సనత్‌నగర్‌తో పాటు అల్వాల్, ఎల్‌బీనగర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో నిర్మిస్తున్న టిమ్స్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఎంజీఎం వరంగల్, నిమ్స్ విస్తరణ పనులను కూడా వేగవంతం చేసి సామాన్యులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ టిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య సదుపాయాలు ఎవరినైనా ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఇక్కడ ఏకంగా 16 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడేందుకు 300 ఐసీయూ బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక రేడియాలజీ విభాగంతో పాటు ఎమ్మారై, సీటీ స్కాన్ వంటి ఖరీదైన పరీక్షలు ఇక్కడ అతి తక్కువ సమయంలోనే పూర్తవుతాయి. అత్యంత విలాసవంతమైన 30 వీఐపీ సూట్స్ కూడా ఇక్కడ నిర్మించడం విశేషం. కేవలం రోగులకు చికిత్స అందించడమే కాకుండా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చేలా రీసెర్చ్ విభాగానికి పెద్దపీట వేశారు. అకడమిక్ బ్లాక్, రీసెర్చ్ బ్లాక్ వంటి వినూత్న విభాగాలు ఈ ఆసుపత్రికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వైద్య విద్యార్థుల కోసం, సదస్సుల నిర్వహణ కోసం 300 మంది కూర్చునే సామర్థ్యం ఉన్న భారీ ఆడిటోరియం నిర్మాణం పూర్తయింది. ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులకు పార్కింగ్ కష్టాలు ఉండకూడదని 1000 కార్లు నిలిపేలా విశాలమైన పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే భయపడే పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అనే నాటి పాటను ప్రజలు మరిచిపోయేలా నేటి కట్టడాలు ఉన్నాయని ఆయన కొనియాడారు. "నేను పోతే సర్కారు దవాఖానకే పోతా" అని ప్రజలు గర్వంగా చెప్పుకునేలా ఈ భవనాలను నిర్మించారని చెప్పారు. ఈ అద్భుత నిర్మాణాల వెనుక ఉన్న ఇంజినీర్ల కృషిని, కార్మికుల కష్టాన్ని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ వైద్యశాలలు తెలంగాణ గర్వకారణంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరంలో ఒకప్పుడు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులు మాత్రమే దిక్కుగా ఉండేవి. జనాభా పెరిగే కొద్దీ ఆ ఆసుపత్రుల పై ఒత్తిడి పెరిగి పేదలకు సరైన సమయంలో చికిత్స అందడం కష్టతరంగా మారింది. ఆ లోటును భర్తీ చేస్తూ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం నగరానికి నాలుగు వైపులా అద్భుతమైన హెల్త్ హబ్‌లను ప్లాన్ చేసింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేయలేని సామాన్యుడికి ఈ టిమ్స్ ఆసుపత్రులు ఒక వరప్రసాదంలా మారుతాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్య రంగంతో అనుసంధానం చేస్తూ డిజిటల్ హెల్త్ రికార్డుల విధానాన్ని కూడా ఇక్కడ ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచస్థాయి వైద్యం ఇంటి చెంతకే వస్తుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ కల సాకారం కావాలంటే పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నిజాం కాలం నాటి ఆసుపత్రులే దిక్కుగా ఉన్న పరిస్థితిని కేసీఆర్ మార్చేశారు. గత పాలకులు ప్రభుత్వ వైద్య రంగంపై చూపే నిర్లక్ష్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బసవతారకం ఆసుపత్రి బయట రోడ్డుపై రోగుల సహాయకులు పడుకోవడం చూసి చలించిన కేసీఆర్ ఒక మానవీయ నిర్ణయం తీసుకున్నారు. టిమ్స్ ఆసుపత్రి పరిధిలోనే అటెండెంట్ల కోసం 200 పడకల సామర్థ్యంతో ఆధునిక ధర్మశాలను నిర్మింపజేశారు. రోగితో పాటు వచ్చే వారికి కనీస వసతులు కల్పించడం ద్వారా ప్రభుత్వం వారి పట్ల ఉన్న బాధ్యతను చాటుకుంది. రాజభవనాన్ని తలపించేలా ఉన్న ఈ భవనాలు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలు. ఆరోగ్య తెలంగాణ లక్ష్య సాధనలో ఇదొక కీలక ఘట్టమని కేటీఆర్ అభివర్ణించారు. రూ.1200 కోట్లు వెచ్చించి ఒక్కో యూనిట్‌ను నిర్మించడం ద్వారా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు బీఆర్ఎస్ ప్రభుత్వం నాంది పలికింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడితేనే సామాన్యుడి ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన ఆకాంక్షించారు. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వ వైద్య రంగమే బలమైన ఆయుధమని భావించి ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యమని భావించి పనులను త్వరగా ముగించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య సేవలు ప్రారంభమైతే వేలాది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. ప్రజల పక్షాన పోరాడుతూనే అభివృద్ధిని కాంక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్ డెస్టినేషన్‌గా మార్చాలనేది కేసీఆర్ వ్యూహమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ టిమ్స్ ఆసుపత్రులు కేవలం తెలంగాణ ప్రజలకే కాకుండా పొరుగు రాష్ట్రాల వారికి కూడా ఆశాదీపంగా మారుతాయని చెప్పారు. అధునాతన వైద్య పరికరాలు, నిపుణులైన డాక్టర్లు, నాణ్యమైన మందులు ఒకే చోట దొరికేలా వ్యవస్థను రూపొందించారు. సామాన్యుడి గుండె చప్పుడు తెలిసిన నేత కాబట్టే కేసీఆర్ ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించారు. పేదవాడి సొంతింటి కలలాగే, పేదవాడికి నాణ్యమైన వైద్యం కూడా అందాలనేది తమ పార్టీ విధానమని చెప్పారు. ఈ అద్భుతమైన ఆసుపత్రుల నిర్మాణం ద్వారా ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని ఆయన గర్వంగా ప్రకటించారు. జిల్లాకొక మెడికల్ కాలేజీని తీసుకురావడం ద్వారా వైద్య విద్యను పేద విద్యార్థులకు చేరువ చేశామని కేటీఆర్ వివరించారు. తద్వారా భవిష్యత్తులో తెలంగాణ డాక్టర్ల గడ్డగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వాలు ఎందుకు ఇలాంటి ఆలోచనలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వానికి ఉన్న విజన్ వల్లే ఇదంతా సాధ్యమైందని చెప్పారు. టిమ్స్ ఆసుపత్రుల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అంచనా వేశారు. నగర అభివృద్ధిలో వైద్య సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. అన్ని హంగులతో సిద్ధమైన ఈ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఒక్కసారి గెలిస్తే ఇంకెప్పుడూ ఓడిపోం

- తెలంగాణలో అధికారం దక్కించుకోవడమే లక్ష్యం
- ఏ పార్టీతోనూ పొత్తుల్లేవు, 119 సీట్లలో పోటీ
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం
- వ్యవసాయం, మహిళా భద్రతపై స్పెషల్ ఫోకస్
- 45శాతం ఓట్లే లక్ష్యంగా పక్కా ప్లాన్
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు తామే అసలైన ప్రత్యామ్నాయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ యవనికపై కమలనాథులు సరికొత్త వ్యూహాలతో విరుచుకుపడుతున్నారు. 2028 ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అమ్ములపొదిలోని అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఎన్. రామచందర్ రావు తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. వే టు న్యూస్ కాన్‌క్లేవ్ వేదికగా ఆయన వెల్లడించిన అభిప్రాయాలు చూస్తుంటే, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధమైనట్లు కనిపిస్తోంది. గత దశాబ్ద కాలంగా తెలంగాణ సమాజం చూసిన పాలనా పరమైన వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల ఆశలను అందిపుచ్చుకోవడమే తమ ఏకైక ధ్యేయమని ఆయన కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య నలిగిపోతున్న సామాన్య ఓటర్లకు భారతీయ జనతా పార్టీ ఒక బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ గడ్డపై అధికార పీఠాన్ని దక్కించుకోవడం ఇప్పుడొక చారిత్రక అవసరమని కాషాయ దళం భావిస్తోంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, బీజేపీ ఓటు శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2018 శాసనసభ ఎన్నికల్లో కేవలం 7 శాతం ఉన్న ఓటు బ్యాంకు, 2023 నాటికి సుమారు 14 శాతం వరకు చేరుకుంది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 35 శాతం ఓట్లను కొల్లగొట్టడం ద్వారా తాము రేసులో ఉన్నామని నిరూపించుకున్నారు. ఈ క్రమంలోనే 2028 నాటికి కనీసం 45 శాతం ఓట్లను సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో పట్టు సాధించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇతర పార్టీల నుంచి కీలక నేతలు స్వచ్ఛందంగా కమలం గూటికి చేరుతుండటం తమ బలానికి నిదర్శనమని రామచందర్ రావు విశ్లేషించారు. రాజకీయాల్లో పొత్తులనేవి ఎప్పుడూ ఒక గందరగోళ పరిస్థితిని సృష్టిస్తాయి. అయితే రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ రాజీ పడే ప్రసక్తే లేదని బీజేపీ అధిష్టానం స్పష్టం చేస్తోంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలతో స్నేహం కేవలం మద్దతు వరకే పరిమితమని, సీట్ల పంపకాలలో వాటా ఉండదని క్లారిటీ ఇచ్చారు. ఒకవేళ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వంటి హేమాహేమీలు బీజేపీ గెలుపు కోసం ప్రచారం చేస్తామంటే సాదరంగా ఆహ్వానిస్తామని చెప్పడం విశేషం. పొత్తుల వల్ల సొంత క్యాడర్ నష్టపోకుండా ఉండాలని, ఒంటరి పోరాటం ద్వారానే పార్టీ అసలైన సత్తా నిరూపించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. 119 నియోజకవర్గాల్లో సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టి, పూర్తి స్థాయిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు కసరత్తు మొదలైంది. రైతాంగ సమస్యల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేవలం ఓట్ల కోసమే నాటకాలు ఆడుతున్నాయని కమలం పార్టీ నేతలు మండిపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను గణనీయంగా పెంచినప్పటికీ, రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో దళారుల వ్యవస్థ వల్ల రైతులకు అన్యాయం జరుగుతోంది. ముఖ్యంగా వరి, పత్తి రైతులకు రావాల్సిన లబ్ధిని మధ్యవర్తులు కాజేస్తున్నారన్నది వీరి ప్రధాన ఆరోపణ. గడిచిన కొద్ది కాలంగా 2,500 కంటే ఎక్కువ రైతు చైతన్య యాత్రలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని వారు పేర్కొంటున్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించే నిధులను సరైన రీతిలో ఖర్చు చేయకుండా పక్కదారి పట్టిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే దఫా రైతులు తమ పక్షాన నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకసారి బీజేపీ అధికారంలోకి వస్తే తమ పాలనా దక్షతతో ప్రజల మనసులు గెలుచుకుంటామని, ఆ తర్వాత మమ్మల్ని గద్దె దించడం ఎవరితరం కాదని రామచందర్ రావు సవాల్ విసిరారు. గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ ఇన్ని దశాబ్దాలుగా పాతుకుపోవడానికి కారణం క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే తరహా అభివృద్ధిని చూపిస్తామని హామీ ఇస్తున్నారు. సుపరిపాలన అందిస్తూ అవినీతి రహిత రాష్ట్రాన్ని నిర్మించడమే తమ విజన్ అని చెబుతున్నారు. ఒకప్పుడు నామమాత్రపు ఉనికి కలిగిన పార్టీ నేడు ఏకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి చేరడం కార్యకర్తల కష్టార్జితమేనని కొనియాడారు. రాజీలేని పోరాటమే తమను గమ్యస్థానానికి చేరుస్తుందని నమ్ముతున్నారు. మహిళా సాధికారత విషయంలో తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నామని రామచందర్ రావు పునరుద్ఘాటించారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజంలో సమూల మార్పులు సాధ్యమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెంచే దిశగా బీజేపీ అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా భద్రత, ఉపాధి కల్పన వంటి అంశాలకు పెద్దపీట వేయనున్నారు. ఇతర పార్టీలు కేవలం హామీలకే పరిమితమైతే, తాము ఆచరణలో చూపిస్తామని గట్టిగా చెబుతున్నారు. ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లడంలో మహిళా మోర్చా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇది తమకు అదనపు బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. బండి సంజయ్ కుటుంబ వ్యవహారంపై జరుగుతున్న ప్రచారాన్ని రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఒక వ్యక్తిగత వివాదాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఆ కేసులో ఉన్న వ్యక్తి బండి సంజయ్ కుటుంబానికి చెందిన వాడై ఉండొచ్చు కానీ, అది పార్టీకి సంబంధించిన విషయం కాదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, పోలీసులు దర్యాప్తు చేసి బాధ్యులను శిక్షిస్తారని ఆయన వెల్లడించారు. బాధితురాలికి న్యాయం జరగాలనే దానికంటే కూడా బండి సంజయ్ ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా ప్రత్యర్థులు గోడలపై పోస్టర్లు అంటించడం అమానుషమని ధ్వజమెత్తారు. వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడం వల్ల ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం మూడు ప్రధాన ధృవాల మధ్య రాజకీయం నడుస్తోంది. గత పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలు, ప్రస్తుత ప్రభుత్వంలో నెలకొన్న అస్థిరత వంటి అంశాలను బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంటోంది. ప్రతి చిన్న అవకాశాన్ని వదలకుండా నిరసనలు, ధర్నాల ద్వారా ప్రజల గొంతుకగా నిలుస్తోంది. సోషల్ మీడియా ద్వారా యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక విభాగాలు పనిచేస్తున్నాయి. ప్రధాని మోదీ క్రేజ్‌ను తెలంగాణలో ఓట్లుగా మలచుకోవడంలో సక్సెస్ అవుతామని నాయకత్వం ధీమాగా ఉంది. బూత్ స్థాయి ఇన్‌చార్జుల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అధికార పీఠమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లను ధీటుగా ఎదుర్కొంటామని చెబుతున్నారు.

పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం నింపేందుకు వరుసగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ లోపల అసమ్మతికి తావులేకుండా అందరినీ కలుపుకుని పోయేలా రామచందర్ రావు కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా, ఓట్ల శాతం పెరగడం సానుకూల అంశంగా భావిస్తున్నారు. ఈసారి సుమారు 60 నుంచి 70 సీట్లను కైవసం చేసుకోవాలనే టార్గెట్‌తో పని చేస్తున్నారు. గ్రామాల్లో కమలం జెండా రెపరెపలాడేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నారు. గతంలో జరిగిన పొరపాట్లపై ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను తిప్పికొట్టేలా ఎప్పటికప్పుడు సరికొత్త ఎత్తుగడలు వేస్తూ రాజకీయ చదరంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు.

అంతిమంగా 2028 తెలంగాణ రణక్షేత్రంలో గెలుపు గుర్రం ఎక్కేది తామేనని బీజేపీ ఘంటాపథంగా చెబుతోంది. అటు కేంద్ర పథకాల ప్రచారం, ఇటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. రామచందర్ రావు నేతృత్వంలో పార్టీ మరింత దూకుడుగా వ్యవహరించనుంది. రాజకీయాల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ, అధికారమే పరమావధిగా కమలనాథులు కదనరంగంలోకి దూకుతున్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పు కేవలం బీజేపీతోనే సాధ్యమని వారు బలంగా నమ్ముతున్నారు. ఈ రాజకీయ చదరంగంలో ఎవరు విజేతగా నిలుస్తారో తెలియాలంటే మరో రెండేళ్ల వరకు వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా, తెలంగాణ రాజకీయాలు ఇప్పుడొక కీలక మలుపులో ఉన్నాయి. తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని బీజేపీ శ్రేణులు ప్రతిన బూనుతున్నాయి.

# హైదరాబాద్‌కు హైస్పీడ్ హంగులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోని ప్రముఖ మెట్రో నగరాలతో అనుసంధానిస్తూ ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు సరికొత్త రూపు దాల్చుతున్నాయి. రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చే ఈ బృహత్తర ప్రాజెక్టులపై సత్వరమే సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పురోగతిపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ భూసేకరణ వంటి కీలక ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం రవాణా వ్యవస్థకు మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రానికే దిక్సూచిగా మారనుందని సీఎస్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలను అనుసంధానించే ఈ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది. ఈ కారిడార్ల అభివృద్ధి వల్ల రాష్ట్రం ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా రూపాంతరం చెందే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలోనే అత్యంత వేగవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వాణిజ్య, పారిశ్రామిక రంగాలు ఊపందుకుంటాయని అంచనా వేస్తున్నారు. ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక, ఐటీ రంగాల విస్తృతికి ఈ కారిడార్లు ఊతమిస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడినట్లు ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు. ఆర్థిక పురోగతిలో ఇవి సరికొత్త మైలురాళ్లుగా నిలవనున్నాయి. హైదరాబాద్ పుణే ముంబై మధ్య ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ మార్గానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇప్పటికే సిద్ధమైందని రైల్వే అధికారులు సమావేశంలో వెల్లడించారు. సుమారు 671 కిలో మీటర్ల పొడవునా సాగే ఈ మార్గం కోసం అవసరమైన ప్రతిపాదనలు తుది దశకు చేరుకున్నాయి. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ పరిధిలో సుమారు 93 కిలో మీటర్ల నిడివిలో భూమిని సేకరించాల్సి ఉంటుందని అధికారులు గణాంకాలను వివరించారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతికపరమైన చిక్కులను తొలగించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. రైల్వే ప్రాజెక్టు నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ముంబై కారిడార్‌తో పాటు హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ చెన్నై హైస్పీడ్ కారిడార్లపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ రెండు ప్రధాన మార్గాల విస్తరణ కోసం తెలంగాణ పరిధిలో సుమారు 123 కిలో మీటర్ల మేర భూసేకరణ చేపట్టాల్సిన అవసరం ఉందని రైల్వే అధికారులు సీఎస్‌కు వివరించారు. కారిడార్ల నిర్మాణంతో పాటు రైళ్ల నిర్వహణకు కీలకమైన రైల్వే డిపోల ఏర్పాటుపై కూడా ప్రాథమికంగా చర్చించారు. ముఖ్యంగా నగర శివారులోని కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోల నిర్మాణానికి తగిన భూములను గుర్తించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనివల్ల నగరానికి అన్ని వైపుల నుంచి మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా రవాణా పరమైన ఇబ్బందులు తప్పుతాయని భావిస్తున్నారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్టు విజయవంతం కావాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం అవసరమని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. రోడ్లు భవనాల శాఖ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు కేంద్ర రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ముఖ్యంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో ప్రాజెక్టు అమలుకు సంబంధించి జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో భూసేకరణ సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని కోరారు. మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి హైస్పీడ్ రైలు మార్గాలు వెన్నెముకగా నిలుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నుంచి పొరుగు రాష్ట్రాల రాజధానులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడం వల్ల వ్యాపార లావాదేవీలు వేగవంతం కానున్నాయి. ఐటీ రంగంలో ఉన్న నిపుణులకు ఇతర నగరాలతో రాకపోకలు సులభతరం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతలో భాగంగా రాబోయే రెండు దశాబ్దాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు సీఎస్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు వల్ల పట్టణీకరణ ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా దీని ఫలాలు అందుతాయి. రైల్వే స్టేషన్ల పరిసరాల్లో నూతన టౌన్‌షిప్‌లు, వాణిజ్య సముదాయాలు వెలిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



భూసేకరణ కోసం ప్రభావితం అయ్యే రైతులకు, భూయజమానులకు సకాలంలో పరిహారం అందించేలా రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. సామాజిక ప్రభావ అంచనా నివేదికలను కూడా త్వరలోనే సిద్ధం చేయనున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో సాగే ఈ ప్రాజెక్టులు తెలంగాణ రవాణా ముఖచిత్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చివేస్తాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. గతంలో ప్రతిపాదించిన రైల్వే ప్రాజెక్టుల పురోగతిని కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎస్ వికాస్ రాజ్, నవీన్ మిట్టల్ వంటి ఉన్నతాధికారులను కోరారు. ప్రాజెక్టు రిపోర్టుల తయారీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేలా హైస్పీడ్ రైలు స్టేషన్ల కనెక్టివిటీ ఉండాలని చర్చించారు. భవిష్యత్తులో ఈ కారిడార్లను మెట్రో రైలు మార్గాలతో అనుసంధానించే అంశాన్ని కూడా పరిశీలించాలని హెచ్ఎండీఏ కమిషనర్‌కు సూచించినట్లు సమాచారం. హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుల అమలు వల్ల పర్యాటక రంగానికి కూడా భారీగా ప్రయోజనం కలుగనుంది. ముఖ్యంగా చారిత్రక నగరమైన హైదరాబాద్ సందర్శనకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పొరుగు రాష్ట్రాల నుంచి అతి తక్కువ సమయంలోనే హైదరాబాద్ చేరుకునే సదుపాయం ఉండటం వల్ల హోటల్, సర్వీస్ రంగాలు వృద్ధి చెందుతాయి. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఈ కనెక్టివిటీ తోడ్పడుతుందని సీఎస్ పేర్కొన్నారు. ఇంటర్నల్ రవాణా వ్యవస్థను కూడా హైస్పీడ్ రైల్ స్టేషన్లకు అనుసంధానించడం ద్వారా ప్రయాణికులకు సులభతరమైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్ తమ శాఖల పరిధిలోని అంశాలను వివరించారు. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ నగర అభివృద్ధి ప్రణాళికల గురించి సీఎస్‌కు ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర రైల్వే శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ప్రాజెక్టు సాంకేతిక అంశాలను, అలైన్‌మెంట్ వివరాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు విమానాశ్రయం పరిధిలో రైల్వే కనెక్టివిటీకి సంబంధించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా




**మొదటిపేజీ తరువాయి**

ఒక ప్రత్యేక స్థానం ఉందని, అది కేవలం క్రమశిక్షణ వల్లే సాధ్యమైందని ఆయన వివరించారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యత ఇస్తానని రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో తాను తెలుగుదేశం పార్టీలో పదేళ్ల పాటు పనిచేసిన కాలాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్టీలు మారినప్పుడు నాయకుల మధ్య వైరం ఉండటం సహజమని, కానీ చంద్రబాబు నాయుడు ఇప్పటికీ తనను గౌరవిస్తారని ఆయన తెలిపారు. తాను టిడిపిని వీడే సమయంలో నేరుగా విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు తన నిర్ణయాన్ని వివరించి వచ్చానని చెప్పారు. ఇలాంటి సంస్కారం రాజకీయాల్లో చాలా అరుదుగా కనిపిస్తుందని, పాత బంధాలను గౌరవించడం తన వ్యక్తిత్వమని ఆయన వెల్లడించారు. వ్యక్తిగత సంబంధాలకు, రాజకీయ సిద్ధాంతాలకు మధ్య ఉన్న తేడాను ఆయన చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుత కాలంలో ప్రజల ఆలోచనా విధానం వేగంగా మారుతోందని, జనం ఇప్పుడు "స్విగ్గీ పాలిటిక్స్" కోరుకుంటున్నారని ముఖ్యమంత్రి ఒక ట్రెండీ విశ్లేషణ చేశారు. అంటే ఏదైనా ఆర్డర్ ఇస్తే వెంటనే డెలివరీ కావాలని కోరుకున్నట్లుగానే, రాజకీయాల్లో కూడా తక్షణ ఫలితాలు, వేగవంతమైన నిర్ణయాలు ప్రజలు ఆశిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సాంకేతికత పెరిగిన ఈ రోజుల్లో పాలన కూడా అంతే వేగంగా ఉండాలని ఆయన భావిస్తున్నారు. అందుకే తన ప్రభుత్వం కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా వేగంగా స్పందిస్తోందని ఆయన తెలిపారు. కాలంతో పోటీ పడుతూ నిర్ణయాలు తీసుకుంటేనే నాయకులకు ఆదరణ ఉంటుందని ఆయన నమ్ముతున్నారు. రాహుల్ గాంధీకి దేశ ప్రధాని కావాలనే స్వార్థం ఏమాత్రం లేదని, కేవలం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే ఆయన కష్టపడుతున్నారని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. వికారాబాద్‌లో జరిగిన ఒక ముఖ్యమైన కాంగ్రెస్ సమావేశంలో తానే స్వయంగా రాహుల్ గాంధీని ఒప్పించానని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టాలని తాను పట్టుబట్టినట్లు చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని, ఆయన నిస్వార్థ రాజకీయాలు దేశానికి అవసరమని వివరించారు. అధికార దాహం లేని నాయకుడి కింద పనిచేయడం తనకు గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీనే ఉంటారని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మొదట కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తుందని, ఆ తర్వాత మిగిలిన మిత్రపక్షాలను కూడా ఒప్పించే బాధ్యతను తాము తీసుకుంటామని చెప్పారు. 2024 నుండి 2034 వరకు అంటే సుమారు 3650 రోజుల పాటు కాంగ్రెస్ కూటమికి ప్రజలు అధికారం ఇస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఒక స్పష్టమైన పాలసీ డాక్యుమెంట్‌ను ప్రజల ముందుకు తీసుకువస్తామని, దాని ఆధారంగానే ఓట్లు అడుగుతామని తెలిపారు. ప్రజల తీర్పు ఈసారి చారిత్రాత్మకంగా ఉండబోతుందని ఆయన విశ్లేషించారు. తెలంగాణ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డికి ఒక ఖచ్చితమైన విజన్ ఉంది. 2034 వరకు తనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటానని ఆయన చాలా ధైర్యంగా ప్రకటించారు. ఈ పదేళ్ల కాలంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా దేశ జీడీపీలో తెలంగాణ వాటా గణనీయంగా పెరగాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మన రాష్ట్రం నుంచి సుమారు 10 శాతం వాటా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, గణాంకాలతో కూడిన వృద్ధిని సాధించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2034 వరకు తాను ఇక్కడి ప్రజల కోసమే అంకితమై పనిచేస్తానని చెప్పారు. ఆ తర్వాత తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగనని, తదుపరి తరానికి అవకాశం కల్పిస్తానని ఒక గొప్ప ప్రకటన చేశారు. పదవుల కంటే ప్రజా సేవ ముఖ్యం అని, ఒకే దగ్గర పాతుకుపోవడం కంటే కొత్త రక్తాన్ని ప్రోత్సహించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పదేళ్ల కాలం ఒక రాష్ట్రాన్ని ప్రక్షాళన చేయడానికి సరిపోతుందని ఆయన నమ్ముతున్నారు. నాయకత్వ మార్పు అనేది ప్రజాస్వామ్యంలో ఒక ఆరోగ్యకరమైన పరిణామమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి సేవలందించిన తర్వాత దేశానికి కూడా తన వంతు సహకారం అందిస్తానని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా తాను గడించిన అనుభవాన్ని దేశ ప్రగతి కోసం పంచుతానని చెప్పారు. ఢిల్లీ రాజకీయాల్లో కూడా తన పాత్ర ఉంటుందని, అయితే అది కేవలం రాహుల్ గాంధీని ప్రధానిగా చూసిన తర్వాతే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాత ఆయన తనకు ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణం ఎప్పుడూ ప్రజా హితం కోసమే సాగుతుందని ఆయన వివరించారు. రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి బలంగా నమ్ముతున్నారు. 2034 తర్వాత తాను తప్పుకోవడం ద్వారా యువ నాయకత్వం ఎదగడానికి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు. తన పదవీ కాలంలో సాధించిన అభివృద్ధిని ఒక వారసత్వంగా అందిస్తానని చెప్పారు. అప్పటికి తెలంగాణ ఆర్థికంగా అత్యంత శక్తివంతమైన రాష్ట్రంగా మారుతుందని ఆయన అంచనా వేశారు. రాబోయే పదేళ్లలో ప్రతి పథకం క్షేత్రస్థాయిలోకి వెళ్లేలా చూస్తామని, లబ్ధిదారులకు 100 శాతం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సంస్కరణల వేగం పెంచి పరిపాలనను పారదర్శకం చేస్తామని ఆయన వివరించారు. చివరగా, రేవంత్‌రెడ్డి మాటల్లో ఒక రకమైన ఆత్మవిశ్వాసం, స్పష్టత కనిపించాయి. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పునఃవైభవం సాధిస్తుందని, దానికి తెలంగాణ ఒక దిక్సూచిలా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉంటుందని, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇండియా కూటమి పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణలో తాను చేపట్టబోయే విప్లవాత్మక మార్పులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో మార్పు మొదలైందని, అది ప్రజల ఆశయాలకు అనుగుణంగా సాగుతుందని రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు. భవిష్యత్తుపై ఆయనకు ఉన్న ధీమా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# జూన్ 21న నీట్ రీఎగ్జామ్

**విశాలభారతి, జాతీయం:**

నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పునర్నిర్వహణకు సంబంధించిన ఈ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. మే నెల 3వ తేదీన ఎంతో ఆశతో పరీక్ష రాసిన అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీసుకున్న నిర్ణయం పెద్ద షాక్ ఇచ్చింది. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలు వెల్లువెత్తడంతో విద్యా వ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే ఎన్‌టీఏ పరిస్థితిని సమీక్షించి పరీక్షను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అక్రమాలకు తావులేకుండా పారదర్శకతను కాపాడడమే లక్ష్యంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. వేల గంటల శ్రమను పణంగా పెట్టిన విద్యార్థులకు ఇది కొంత నిరాశ కలిగించినా న్యాయం జరుగుతుందనే ఆశ మాత్రం సజీవంగా ఉంది. తాజాగా విడుదలైన షెడ్యూల్ ప్రకారం జూన్ 21వ తేదీ ఆదివారం నాడు ఈ రీఎగ్జామ్ జరగనుంది. విద్యార్థులు మళ్లీ సమరానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైంది. ఈసారి పరీక్షా నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఎన్‌టీఏ సర్వసన్నద్ధమవుతోంది. అభ్యర్థులు కేవలం అధికారిక సమాచార ఛానల్స్‌ను మాత్రమే ఫాలో అవ్వాలని సూచించడం విశేషం. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. ఈ కొత్త షెడ్యూల్ విద్యార్థులకు పునశ్చరణ చేసుకునేందుకు సుమారు ఒక నెల రోజుల సమయాన్ని కల్పిస్తోంది. లోపాలను సరిదిద్దుకుని మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇదొక అద్భుత అవకాశం అని చెప్పవచ్చు. అభ్యర్థులకు ఊరటనిచ్చే అతిపెద్ద విషయం ఏమిటంటే వారు మళ్లీ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. పాత దరఖాస్తు డేటా ఆధారంగానే హాల్ టికెట్లు జారీ అవుతాయి. అదనపు పరీక్షా రుసుము రూపంలో ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన పని లేదని ఎన్‌టీఏ నిర్మొహమాటంగా చెప్పేసింది. గతంలో కేటాయించిన పరీక్షా కేంద్రాలనే గరిష్టంగా పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. దీనివల్ల విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు కూడా తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇప్పటికే చెల్లించిన ఫీజును రీఫండ్ చేస్తామని ప్రకటించడం విద్యార్థి లోకానికి పెద్ద రిలీఫ్ అని చెప్పాలి. ఆర్థిక భారంతో సంబంధం లేకుండా కేవలం సబ్జెక్టుపై దృష్టి పెట్టేలా ఈ నిబంధనలు రూపొందించారు. రాజస్థాన్ వేదికగా వెలుగులోకి వచ్చిన ఈ పేపర్ లీక్ ఉదంతం నిజంగా దిగ్భ్రాంతికరం. పరీక్షకు ముందే పంపిణీ చేసిన ప్రాక్టీస్ మెటీరియల్‌లో అసలు పేపర్‌లోని ప్రశ్నలు ఉండడం అగ్నికి ఆజ్యం పోసింది. మొత్తం 720 మార్కులకు గాను ఏకంగా 600 మార్కుల ప్రశ్నలు ముందుగానే బయటకు రావడం వ్యవస్థలోని లొసుగులను ఎత్తిచూపుతోంది. అంటే దాదాపు 83.33 శాతం ప్రశ్నలు పరీక్షకు ముందే అక్రమార్కుల చేతికి అందాయన్నమాట. సికార్ ప్రాంతంలో మే 1వ తేదీనే ఈ గెస్ పేపర్లు దర్శనమిచ్చాయని దర్యాప్తులో తేలింది. పరీక్షకు సరిగ్గా 48 గంటల ముందే ఇంత భారీ స్థాయిలో సమాచారం లీక్ అవ్వడం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దర్యాప్తు అధికారులు వెల్లడించిన గణాంకాలు వింటే మైండ్ బ్లాక్ అవ్వడం ఖాయం. ఒక్కో ప్రశ్నపత్రాన్ని 20,000 నుంచి 2,00,000 రూపాయల వరకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయి. అంటే ప్రతిభకు కాకుండా ధనబలానికి ప్రాధాన్యత ఇచ్చేలా ఈ అక్రమ వ్యాపారం సాగింది. అసలు పరీక్షలో వచ్చిన 180 ప్రశ్నలలో 140 ప్రశ్నలు ఆ ప్రాక్టీస్ క్వశ్చన్ బ్యాంక్‌లోనే ఉండడం యాదృచ్ఛికం కాదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రశ్నల వరస క్రమం కూడా అచ్చు గుద్దినట్లు సరిపోలడం గమనార్హం. కేవలం ప్రశ్నలే కాకుండా సమాధానాల ఆప్షన్లు కూడా మార్పు లేకుండా ఉండడం లీకేజీకి బలమైన సాక్ష్యంగా నిలిచింది. ఈ స్థాయిలో పకడ్బందీగా అక్రమాలు జరగడం పట్ల విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో విద్యార్థులు తమ ఏకాగ్రతను కోల్పోకుండా ఉండడం చాలా ముఖ్యం. ఒక్కో సెకను ఎంతో విలువైనదని గుర్తించి చదువుపై ఫోకస్ పెట్టాలి. జరిగిన పొరపాట్లను పక్కన పెట్టి జూన్ 21న జరిగే పరీక్ష కోసం కత్తికి పదును పెట్టాలి. ఎన్‌టీఏ కూడా ఈసారి సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌ను భారీగా పెంచబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను పటిష్టం చేయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా నేత్రాలను మరింత చురుగ్గా ఉంచనున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా దానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పారదర్శకమైన పరీక్షా విధానం ద్వారానే అర్హులైన విద్యార్థులకు సీట్లు దక్కుతాయి. రీఎగ్జామ్ నిర్వహణ అనేది ఒక సవాలుతో కూడుకున్న వ్యవహారం. దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఒకే సమయంలో పరీక్ష నిర్వహించడం అంటే సాధారణ విషయం కాదు. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎన్‌టీఏ వెనక్కి తగ్గలేదు. లీకేజీల వల్ల నష్టపోయిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ నిర్ణయం ఒక పెద్ద వరం. కష్టపడి చదివే వాళ్లకు మాత్రమే గుర్తింపు రావాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నారు. అక్రమార్కుల ఆట కట్టించేందుకు ప్రభుత్వం సిట్ దర్యాప్తును కూడా ముమ్మరం చేసింది. ఇప్పటికే పలువురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సాంకేతికత ఎంత పెరిగినా దాన్ని దుర్వినియోగం చేసే వారు కూడా పెరుగుతూనే ఉన్నారు. నీట్ లాంటి అత్యున్నత పరీక్షలో ఇటువంటి ఘటనలు జరగడం విచారకరం. భవిష్యత్ డాక్టర్లను తయారు చేసే ప్రక్రియలో నైతికత ప్రాధాన్యత సంతరించుకోవాలి. మే 3వ తేదీన జరిగిన పరీక్షలో ఎవరైతే నిజాయితీగా రాశారో వారు ఆందోళన చెందకుండా తమ ప్రిపరేషన్ కొనసాగించాలి. ఒకసారి రాసిన అనుభవం ఉంది కాబట్టి రెండోసారి ఇంకా బాగా రాసే అవకాశం ఉంటుంది. టైమ్ మేనేజ్‌మెంట్ విషయంలో తలెత్తిన ఇబ్బందులను ఈ గ్యాప్‌లో సరిదిద్దుకోవచ్చు. పాత తప్పులను పునరావృతం చేయకుండా విజయం వైపు అడుగులు వేయాలి. నీట్ యూజీ 2026 మళ్లీ జరగడం వల్ల కటాఫ్ మార్కులలో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉంది. పేపర్ కఠినత్వం స్థాయిని బట్టి ర్యాంకులు మారుతాయి. గతంలో సాధించిన స్కోర్ కంటే మెరుగైన స్కోర్ సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఫీజు రీఫండ్ ప్రక్రియ కూడా త్వరలోనే మొదలవుతుందని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ బ్యాంక్ ఖాతా వివరాలను సరిచూసుకోవడం మంచిది. ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో వచ్చే అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పరీక్షా కేంద్రం కోడ్ లేదా ఇతర సమాచారంలో ఏవైనా మార్పులు ఉంటే ముందే తెలుసుకోవడం ఉత్తమం. హడావిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధమవ్వడం విజయానికి తొలి మెట్టు. లక్షల మంది విద్యార్థుల కలలను సాకారం చేసే ఈ పరీక్ష పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పేపర్ లీకేజీల సంస్కృతిని తుదముట్టించేలా చట్టాలు రావాలి. విద్యార్థులు ధైర్యంగా ఉండి తమ లక్ష్యం వైపు ప్రయాణించాలి. జూన్ 21వ తేదీ ఒక కొత్త ఆరంభం కావాలని కోరుకుందాం. క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్ ఎప్పుడూ విఫలం కాదు. కష్టపడే తత్వం ఉన్న వారికి ఫలితం కచ్చితంగా దక్కుతుంది.



# రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జీవితంలో ఎదురైన ఎన్నో చేదు అనుభవాలు, కఠిన పరిస్థితులు తనను మానసికంగా ఎంతో పరిణితి చెందేలా చేశాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. వేటు న్యూస్ కాంక్లేవ్ వేదికగా ఆమె మాట్లాడుతూ సమాజంలో గుణాత్మక మార్పు తీసుకువచ్చే బలమైన సంకల్పంతోనే కొత్త పార్టీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. రాజకీయాల్లో వ్యూహాలు అత్యంత అవసరమని ఆ విద్యను తాను కేసీఆర్ వద్దే నేర్చుకున్నానని వెల్లడించారు. ఉద్యమ నేతగా కేసీఆర్ ఎంతో గొప్ప వ్యూహకర్త అని కొనియాడారు. అయితే ముఖ్యమంత్రిగా, బీఆర్ఎస్ అధినేతగా మారిన కేసీఆర్ విధానాలతోనే నాతో పాటు చాలా మందికి సమస్యలు వచ్చాయని ఆమె సంచలన నిజాలు బయటపెట్టారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో భిన్నమైన వ్యూహాలు, నిజాయితీతో కూడిన అభిప్రాయాలు చెప్పే అలవాటు తనకు మాత్రమే ఉండేదని కవిత గుర్తు చేసుకున్నారు. తాను లోపల వ్యక్తం చేసిన పర్సనల్ అభిప్రాయాలను కొందరు కావాలనే బయటకు లీక్ చేసి తనను ఇరకాటంలో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులే తనను సొంతంగా పార్టీ పెట్టేలా ప్రేరేపించాయని వివరించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ వివాదం తలెత్తిన తరుణంలో తన సొంత తల్లిగారి కుటుంబం నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదని తొలిసారి బహిరంగంగా అంగీకరించారు. అదే సమయంలో తన అత్తగారి కుటుంబం కొండంత అండగా నిలిచి ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ ఆరోపణలను కోర్టు పూర్తిగా కొట్టివేసిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సిద్ధాంతాల ప్రకారం కాకుండా ఆర్ఎస్ఎస్ ఎజెండాతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అందుకే ఆయనను తాను కాంగ్రెస్ సీఎం అనని, ఆర్ఎస్ఎస్ సీఎం అని పిలుస్తానని వ్యాఖ్యానించారు. బీజేపీ నేత బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన తీవ్రమైన ఆరోపణల కేసుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ లోపాయికారీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాన్ బెయిల్ సెక్షన్లు ఉన్నప్పటికీ అరెస్ట్ చేయకుండా బండి సంజయ్‌కు సీఎం మేలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని మండిపడ్డారు. తన కుమారుడిపై గంభీరమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బండి సంజయ్ కేంద్రమంత్రి పదవిలో కొనసాగడం నైతికంగా సరికాదని కవిత హితవు పలికారు. ఆయన హోంశాఖలో పదవిలో ఉంటే విచారణ సజావుగా సాగదని, అందుకే విచారణ పూర్తయ్యే వరకు ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రధాని నరేంద్ర మోదీకి త్వరలోనే అధికారికంగా లేఖ రాస్తానని స్పష్టం చేశారు. ఒకవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతతో ప్రధాని వేదికలు పంచుకోవడం దేశ ప్రజాస్వామ్యానికే అవమానకరమని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి బడేభాయ్ చోటేభాయ్ లాగా కలిసి పనిచేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సమాజంలో రోజుకు సగటున 7 మహిళలపై అత్యాచార కేసులు నమోదు కావడం లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి నిదర్శనమని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి మీడియా ట్రయల్స్ ద్వారా వారి క్యారెక్టర్‌ను తప్పుపట్టే ధోరణి పెరిగిపోతోందని, దీనిని అడ్డుకోవాలని కోరారు. ఒక అక్కగా కంటే అమ్మగా ఆలోచించినప్పుడే సమాజంలోని అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారాలు దొరుకుతాయని ఆకాంక్షించారు. మెంటల్లీ ఛాలెంజ్డ్ పిల్లల తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ, కేర్ టేకర్ల వ్యవస్థను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. లీడర్‌ను ఎప్పుడూ జెండర్ బేస్డ్ కోణంలో చూడవద్దని హితవు పలికారు.

రాష్ట్రంలో వ్యవసాయ, ఉపాధి రంగాలను గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని కవిత దుయ్యబట్టారు. గత పాలకులు ధరణి పోర్టల్ తెస్తే, వీరు భూమాత అంటున్నారని, పేరు మారినా రైతులను పీడించే గేమ్ మాత్రం మారలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వస్తే యువతను కేవలం ఉద్యోగాల కోసం వెతికేలా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు 2 లక్షల నుంచి 20 కోట్ల రూపాయల వరకు పూచీకత్తు లేని రుణాలు అందిస్తామని ప్రకటించారు. మన యువత నుంచి కనీసం ఒక్క గూగుల్ లాంటి అంతర్జాతీయ సంస్థ వచ్చినా తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ జస్టిస్ అంటే కేవలం కుల రాజకీయాలు కాదని, సమాజంలో వెనుకబడిన అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమని కవిత అభివర్ణించారు. వికలాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ ఆర్మీ జవాన్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తమ పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. దేశంలో ప్రాంతీయ పార్టీల ఉనికిని దెబ్బతీసేందుకు బీజేపీ పెద్ద ఎత్తున కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ఎప్పుడు ఏ మార్పు వచ్చినా అది రాజకీయ పార్టీల శ్రమ వల్లే సాధ్యమైందని గుర్తుచేశారు. జెన్ జీ అని పిలవబడే నేటి తరం యువతకు కేవలం డిగ్రీలే కాకుండా రాజకీయ, సామాజిక అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. నీటి పారుదల రంగంలో తెలంగాణకు ఘోరమైన అన్యాయం జరిగిందని కవిత గణాంకాలతో సహా వివరించారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం 1,89,000 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 30,000 కోట్ల రూపాయలు వెచ్చించిందని తెలిపారు. ఇంత భారీ బడ్జెట్ పెట్టినా రాష్ట్రంలో కొత్తగా కేవలం 15 లక్షల ఎకరాలకు మాత్రమే నీరివ్వగలిగారని ఎండగట్టారు. గోదావరి నదిలో మనకు 960 టీఎంసీలు వాడుకునే హక్కు ఉన్నప్పటికీ కనీసం 250 టీఎంసీలు కూడా వాడుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా సుమారు 4,000 టీఎంసీల గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలుస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన ఆలస్యం వల్ల ఇక్కడి రైతాంగానికి ఊహించని నష్టం వాటిల్లిందని కవిత విశ్లేషించారు. కేవలం 30 నెలల్లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు 132 నెలలు గడుస్తున్నా అసంపూర్తిగానే మిగిలిపోయిందని గుర్తుచేశారు. ప్రారంభంలో 32,000 కోట్ల రూపాయలుగా ఉన్న అంచనా వ్యయం కాస్తా పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం 85,000 కోట్ల రూపాయలకు చేరిందని మండిపడ్డారు. సకాలంలో నీళ్లు ఇవ్వకపోవడం వల్ల దశాబ్ద కాలంలో ఈ ప్రాంత రైతాంగం దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా మహబూబ్ నగర్ జిల్లా నుంచి వలసలు ఆగకపోవడం పాలకుల వైఫల్యమేనని అన్నారు. దేశంలో 80 శాతం మంది ప్రజల నెలసరి సంపాదన 30,000 రూపాయల లోపే ఉందని, అందులో కూడా 70 శాతం కేవలం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రైవేట్ రంగంలోనైనా సరే ఉచిత విద్య, వైద్యం అందించేలా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అన్ని నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తుందని, కచ్చితంగా పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ సాధించిన విజయం తరహాలోనే తెలంగాణలో తాము ప్రభంజనం సృష్టిస్తామని జోస్యం చెప్పారు. రాజకీయాల్లో ఈరోజు ఉన్న పరిస్థితి రేపు ఉండదని, ఒక్క సంఘటనతో ఎంతటి బలమైన నేత అయినా దెబ్బతింటాడని కవిత పేర్కొన్నారు. తనకు చిన్నతనం నుంచి నిజం మాత్రమే మాట్లాడటం అలవాటని, దానివల్ల నష్టం జరిగినా వెనకడుగు వేయనని చెప్పారు. తనకు ఎన్టీఆర్, కేసీఆర్, ఇందిరాగాంధీ, సుష్మా స్వరాజ్, మార్గరేట్ థాచర్, జ్యోతిరావ్ పూలే వంటి మహనీయులు ఆదర్శమని కొనియాడారు. వారి తరహాలోనే ప్రజాసేవలో తనదైన ముద్ర వేయాలని తపిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలకు మర్చిపోలేనంత మంచి చేసి, చరిత్ర పుటల్లో తన పేరు శాశ్వతంగా నిలిచిపోవాలన్నదే తన జీవిత ఆశయమని కవిత స్పష్టం చేశారు.





## యువకుడి ఆత్మహత్య ఘటనలో యువతిపై కేసు నమోదు

- **ప్రేమ పేరుతో మోసం చేసి ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపణ**
- **దర్యాప్తు చేపట్టిన హయత్‌నగర్ పోలీసులు**

**విశాలభారతి ,అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై యువతిపై కేసు నమోదు చేసినట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ గ్రామానికి చెందిన పల్లపు మహేశ్వరి ఈ నెల 13వ తేదీన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె కుమారుడు పల్లపు గోవర్ధన్ (28) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ నైట్ డ్యూటీ ముగించుకొని ఈ నెల 12వ తేదీ ఉదయం సుమారు 10:30 గంటలకు ఇంటికి వచ్చి గది తలుపు వేసుకున్నాడని తెలిపారు. సాయంత్రం వరకు బయటకు రాకపోవడంతో పాటు మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో అనుమానం చెందిన కుటుంబ సభ్యులు గది తలుపు తట్టినా స్పందన రాలేదని పేర్కొన్నారు. అనంతరం గట్టిగా తలుపును నెట్టగా గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే కిందికి దించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తన కుమారుడిని సరిత అనే యువతి ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, అనంతరం దూరంగా ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు క్రైం నంబర్ 794/2026 కింద భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 108 ప్రకారం ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా మృతుడు పల్లపు గోవర్ధన్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (FSL) కు పంపిస్తున్నట్లు తెలిపారు. సాక్ష్యాధారాలను సేకరించి తదుపరి విచారణ కొనసాగించి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు.

## పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి

- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**




**మహబూబాబాద్ విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో శుక్రవారం ఐదవ రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి సమాజాన్ని వెలిగించండి అని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని సంపాదించాలని మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలని మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో , గ్రంథాలయ పాఠకులకు కావలసిన వసతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పాఠకులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు, సమాజ అభివృద్ధి కి విద్య ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ఉన్నంత లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీనియర్ పాఠకుడు టీవీ రామనర్సయ్య, డిఎస్ఓ అప్పారావు , ఏ సి జి, మందుల శ్రీరాములు, ఏ ఎస్ సి సంతోష్, ముక్క లక్ష్మణరావు, నరసింగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ గ్రంథపాలకులు, జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్ ,భూలక్ష్మి, యాదమ్మ బాబా , పుస్తక ప్రియులు , పాఠకులు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో గండి మొత్త వాగు మాయం వెనుక అసలు కథ ఏంటి

- **1985 నుంచి 2025 వరకు ఉన్న వాగు... ఇప్పుడు పట్టా భూమా..?**



**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు మండలంలో గండి మొత్త వాగు మాయం వ్యవహారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2011 సంవత్సరానికి చెందిన చారిత్రక శాటిలైట్ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తున్న సహజ జలమార్గం ప్రస్తుతం మాత్రం వ్యవసాయ భూమిగా, కొంతభాగం పట్టా భూమిలా మారిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, గతంలో భారీ వర్షాల సమయంలో ఈ వాగు ద్వారా నీటి ప్రవాహం జరిగేదని, పరిసర ప్రాంతాల వరద నీరు ఇదే మార్గంలో వెళ్లేదని అంటున్నారు. అయితే క్రమంగా వాగు పరిధిలో మట్టి పోయడం, అంచులను ఆక్రమించడం, సాగుభూమిగా వినియోగించడం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు బయటకు వస్తున్న గూగుల్ ఎర్త్ హిస్టారికల్ ఇమేజరీ ఫోటోలు మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. 2011లో కనిపించిన వాగు మార్గం, 2014లో కొంత తగ్గినట్లు, 2024 నాటికి మరింత కుదించబడినట్లు కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సహజ వాగు భూమి ఎలా పట్టాగా మారింది.?**

భూ రికార్డుల్లో “వాగు పోరంబోకు”, “శికం”, “కాలువ”గా ఉన్న భూములు ప్రైవేట్ పేర్లకు మారాయా? మారితే ఎప్పుడు.? ఏ ఆధారాలతో? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖల వద్ద జీపీఎస్ మ్యాపులు, గ్రామ మ్యాపులు, ఎఫ్ఎంబీ రికార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు ఎప్పుడు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**స్థానిక ప్రజల అభిప్రాయం ప్రకారం**

వాగులు మాయం కావడం అనేది కేవలం భూమి వివాదం మాత్రమే కాదు. భవిష్యత్తులో వరద ముప్పుకు కూడా ఇదే కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహజ నీటి ప్రవాహ మార్గాలు కబ్జా అయితే భారీ వర్షాల సమయంలో నీరు గ్రామాల్లోకి చేరే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

## పీఏసీఎస్‌లకు పాలక మండళ్లు అప్రజాస్వామికం

- **ప్రజాస్వామ్య బద్ధంగా సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి**
- **నామినేటెడ్ భర్తీ నిర్ణయం ఉపసంహరించుకోవాలి**
- **ఆంక్షలు లేకుండా పంటలు కొనుగోలు చేయాలి**




**పాల్వంచ:విశాలభారతి:** ప్రాథమిక సహకార సంఘాలకు(పీఏసీఎస్)ఎన్నికలు జరుపకుండా రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో పాలకమండళ్లను ఏర్పాటు చేయడం అప్రజాస్వామికమని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహించాలని, ఆంక్షలు లేకుండా పంటలు కొనుగోలు చేయాలిని, సిసిఐ కేంద్రాల వద్ద సరిపడా బస్తాలు అందుబాటులో ఉంచాలని, తమ, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున వారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో రైతులతో కలిసి ప్రదర్శనగా తహసిల్దార్ కార్యాలయంకు చేరుకొని ధర్నా నిర్వహించారు, అనంతరం తహసిల్దార్ దారా ప్రసాద్ కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకమండళ్ల నియామకం సరికాదు అన్నారా. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నామినేటెడ్ పాలకమండళ్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతీ సహకార సంఘంలో పాలకపార్టీకి చెందిన సభ్యులను అధ్యక్షులుగా, డైరక్టర్లుగా నామినేట్ చేయాలని ఉద్దేశ్యంతో రాజ్యాంగ విరుద్ధచర్యలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ్ హెచ్ ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. సహకార సంఘంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, రైతులు, కార్మికులు ఐఖ్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లాసమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుండాల నాగరాజు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వైయస్ గిరి, వాడే లక్ష్మి, కొంగర అప్పారావు. శనగారపు శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల విస్తృత తనిఖీలు

**విశాలభారతి, గోదావరిఖని:**




రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంతం,కార్గో పార్సిల్ కేంద్రాలు,దుకాణాలు, పాన్ షాపులతో పాటు పలు బస్సుల్లో కూడా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్ సమన్వయంతో శుక్రవారం నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి సరఫరా, వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌లతో కూడా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. తనిఖీలలో బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగ్ దగ్గరకు స్నిఫర్ డాగ్ వెళ్లి వాసన చూడడంతో అతడిని తనిఖీ చేయగా, బ్యాగ్‌లో పొగాకు (తంబాకు) ప్యాకెట్ లభించింది. ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా,విక్రయిస్తున్నా ప్రత్యేక శిక్షణ పొందిన ఈ డాగ్ క్షణాల్లో గుర్తించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి,మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు,గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులు విక్రయించిన పక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల బ్యాగులు,అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు.గంజాయి,మత్తు పదార్థాలు బస్సులు, రైల్వే మార్గాలు, ప్రైవేట్ వాహనాలు, కార్ల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులు బస్సులు,రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా బ్యాగులతో కనిపించినా,మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.

## ఎన్నికలు ముగియగానే ప్రజలపై భారాల మోత



**బయ్యారం విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య రవి నాయక్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు పూర్తికాగానే ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారాలు మోపడం అన్యాయమని మండిపడ్డారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడం వల్ల కూరగాయలు, నిత్యావసర సరుకులు, రవాణా ఖర్చులు అన్నీ అమాంతం పెరిగి పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న తప్పు ఆర్థిక విధానాల కారణంగా దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం ఇంధన ధరలను తగ్గించకుండా ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మాత్రమే పాలన కొనసాగుతోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపు ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతోందని భూక్య రవి నాయక్ పేర్కొన్నారు. వ్యవసాయ పనులకు అవసరమైన ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా వాహనాల ఖర్చులు పెరగడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఇప్పటికే ప్రకృతి విపత్తులు, మార్కెట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ ధరల పెంపు మరింత భారమైందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందని, సామాన్య ప్రజల పక్షాన నిరంతరం నిలబడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# జనానికే పొదుపు సుద్దులు..!

**మొదటిపేజీ తరువాయి**



కేవలం పేద, మధ్యతరగతి ప్రజలకే పరిమితమా అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తోంది. పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించండి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడండి అంటూ క్లాసులు తీసుకున్న నేతలు, విదేశీ పర్యటనల విషయంలో ఎందుకు వెనక్కి తగ్గడం లేదో అర్థం కావడం లేదు. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు సుమారు 600 బిలియన్ డాలర్ల వద్ద ఊగిసలాడుతున్నాయి. యుద్ధం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటే ఈ నిల్వలు కరిగిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి టైమ్‌లో దౌత్యం పేరుతో చేసే ఖర్చులు సామాన్యుడిపై భారంగా మారుతున్నాయి. కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఈ పొదుపు హడావుడిలో భాగస్వాములవుతామని ప్రగల్భాలు పలికారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను తగ్గించుకుంటామని సినిమాటిక్ డైలాగులు చెప్పారు. అయితే ఈ ముచ్చట కేవలం రెండు రోజులే సాగింది. మళ్లీ యథావిధిగా పదుల సంఖ్యలో వాహనాలతో హల్చల్ చేస్తూ మోదీ మాటలను గాలికొదిలేశారు. అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో మంత్రి కాన్వాయ్ నిర్వహణకు నెలకు సగటున రూ. 15 లక్షలు ఖర్చవుతుంటే, అందులో 10 శాతం కూడా తగ్గించకపోవడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. "నా దేశం నా బాధ్యత" అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిని అనుసరించాలని కేబినెట్ భేటీలో తీర్మానాలు చేశారు. మంత్రులు ఇకపై స్పెషల్ ఫ్లైట్లు వాడబోరని మంత్రి పార్థసారథి గంభీరంగా ప్రకటించారు. కానీ ఆ మాటల వేడి చల్లారకముందే మంత్రి లోకేశ్ పుట్టపర్తికి ప్రత్యేక విమానంలో వెళ్లడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అక్కడ ఆయన వాడిన భారీ కాన్వాయ్ ఖర్చు చూస్తే సామాన్యుడికి గుండె గుభేల్ అంటోంది. చంద్రబాబు కూడా తనదైన శైలిలో పొదుపు మాటలు చెప్పి, మరుసటి రోజే ప్రత్యేక విమానంలో శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వెళ్లడం విమర్శల పాలైంది. ఒక గంట విమాన ప్రయాణానికి దాదాపు రూ. 5 నుండి 8 లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలకు ఒక నీతి, పాలకులకు మరొక నీతి అనే చందంగా ఏపీ ప్రభుత్వ తీరు ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కాన్వాయ్‌ల సైజు తగ్గించామని చెబుతున్నా, భద్రత పేరుతో వందల లీటర్ల ఇంధనం వృథా అవుతూనే ఉంది. ఈ పొదుపు అంతా కేవలం ప్రచారానికే పరిమితమైందని విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. నిజానికి యుద్ధం వల్ల వంట నూనెల ధరలు 20 శాతం పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి దశలో పాలకులు ఆదర్శంగా ఉండాల్సింది పోయి, విలాసాలకు ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకుంటే కనీసం కొంత విదేశీ మారక ద్రవ్యమైనా ఆదా అవుతుంది. కానీ ప్రతిష్ఠాత్మక పర్యటనల పేరుతో చేసే షో వల్ల దేశానికి వచ్చే లాభం కంటే జరిగే నష్టమే ఎక్కువని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశభక్తిని కేవలం సామాన్య జనం మీద రుద్దకుండా, ప్రభుత్వ పెద్దలు కూడా బాధ్యతగా మెలగాలి. పొదుపు చర్యల పేరుతో జరుగుతున్న ఈ డ్రామాలు ప్రజలను మోసం చేయడానికే అని అర్థమవుతోంది. కేవలం ఒక వారం రోజులు హడావుడి చేసి, ఆపై మళ్ళీ పాత పద్ధతులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. సాధారణంగా ఒక అంతర్జాతీయ పర్యటనకు ప్రధాని కార్యాలయం చేసే ఖర్చు కోట్లల్లో ఉంటుంది. ఐదు దేశాల పర్యటన అంటే ఆ మొత్తం భారీగా పెరుగుతుంది. మరి ఈ ఖర్చును తగ్గించుకోవాలనే ఆలోచన ప్రధానికి రాకపోవడం ఆశ్చర్యకరం. ప్రజలను విదేశీ పర్యటనలు వద్దు అన్న మోదీ, తను మాత్రం ఐదు దేశాలకు వెళ్లడం "నేను చెబితే వినాలి.. నేను చేస్తే చూడాలి" అన్నట్లుగా ఉంది. రాజకీయ నాయకులు చేసే ఖర్చులకు లెక్కా పత్రం ఉండదు కానీ, సామాన్యుడు ఒక లీటర్ పెట్రోల్ అదనంగా వాడితే దేశానికి నష్టం అన్నట్లుగా ప్రచారం చేస్తారు. దేశంలో పెట్రోల్ వినియోగం ఏడాదికి సగటున 30 మిలియన్ టన్నులు ఉంటుంది. ఇందులో పది శాతం తగ్గించినా వేల కోట్లు ఆదా అవుతాయి. అయితే ఈ నిబంధనలు కేవలం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడే మధ్యతరగతి జీవికే వర్తిస్తాయి. మంత్రులు మాత్రం తమ ఏసీ కార్లు, స్పెషల్ చార్టర్డ్ ఫ్లైట్లను వదలడానికి సిద్ధంగా లేరు. ఈ వివక్షే ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. సంక్షోభం వచ్చినప్పుడు నాయకులు ముందుండి నడవాలి. త్యాగాలు అనేవి పై నుండి మొదలైనప్పుడే ప్రజల్లో స్ఫూర్తి కలుగుతుంది. పొదుపు సూక్తులు వల్లించడం ఆపేసి, ఆచరణలో చూపిస్తేనే ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. లేకపోతే ఈ పొదుపు ప్రచారాలు కేవలం ఎన్నికల స్టంట్లుగా, ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించే ఎత్తుగడలుగా మిగిలిపోతాయి. పాలకులు తమ విలాసాలను తగ్గించుకుని, నిజమైన దేశభక్తిని చాటుకోవాల్సిన సమయం ఇది. లేదంటే జనాల ఆగ్రహానికి గురికాక తప్పదు. వెయ్యి మాటల కంటే ఒక్క చేత మిన్న అని గ్రహిస్తే మేలు..

## జనగణన సర్వేను పరిశీలించిన జిహెచ్ఎంసి కమిషనర్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జి హెచ్ఎంసి ) పరిధిలో జరుగుతున్న జన గణన ఎన్యూమరేషన్ సర్వేను కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సమగ్రంగా పరిశీలించారు. శంషాబాద్ సర్కిల్18లోని 118వ డివిజన్‌ను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న సర్వే విధానాన్ని ప్రత్యక్షంగా గమనించి, ఫీల్డ్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. ముఖ్యంగా డేటా సేకరణలో ఖచ్చితత్వం, సమగ్రత మరియు వేగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణలో ఉపయోగిస్తున్న విధానాలు, సాంకేతిక పద్ధతులు, అలాగే ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించే విధానంపై కూడా ఆయన వివరణాత్మకంగా ఆరా తీశారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు ఏమిటో తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. వారు కూడా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా, నిర్ణీత గడువులోపు సర్వేను పూర్తి చేయడంతో పాటు, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, జనగణన సర్వే ప్రభుత్వం రూపొందించే అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిదని అన్నారు. అందువల్ల ప్రతి కుటుంబం సరైన సమాచారం ఇవ్వడం ద్వారా ఈ ప్రక్రియకు సహకరించాల్సిన అవసరం ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారం ఉంటేనే సర్వే విజయవంతంగా పూర్తి చేయగలమని, తద్వారా ప్రాంతీయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## బంధువుల పెళ్లికి వెళ్తానని వెళ్లి అదృశ్యం

- **ప్రభుత్వ ఉద్యోగి కోసం గాలిస్తున్న పోలీసులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బంధువుల పెళ్లికి వెళ్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బనోతు భీమ్‌సింగ్ (37) గత రెండేళ్లుగా భార్యతో కలిసి నివాసం ఉంటూ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతడు బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు చేయడంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీ ఉదయం సుమారు 8:30 గంటలకు బంధువుల పెళ్లికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన భీమ్‌సింగ్, అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. అతని మొబైల్ ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.బంధువుల ఇళ్లలో, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. అదృశ్యమైన బనోతు భీమ్‌సింగ్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. భీమ్‌సింగ్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఇంట్లో కలహాల నేపథ్యంలో మహిళ అదృశ్యం

- **మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**
- **వివరాలు వెల్లడించిన హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇంట్లో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్-మంజుల పార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో మంజుల పార్వతమ్మ (38) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మంజుల పార్వతమ్మ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సహకార సంఘాలు రైతుల ఆర్థిక బలోపేతానికి కీలకమైన సంస్థలని, వాటికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వమే నామినేట్ పాలక మండళ్లను నియమించడం రైతు హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పాశ్య పద్మ మాట్లాడుతూ.. సహకార రంగాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా ప్రభుత్వం తక్షణమే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను పక్కనపెట్టి తీసుకుంటున్న నిర్ణయాలు వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తాయని ఆమె అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ద్వారానే పాలక మండళ్లు ఏర్పడాలని, నామినేషన్ల ద్వారా అధికారాన్ని కేంద్రీకరించడం సరైంది కాదన్నారు. రైతు సంఘాల స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, బీఓసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి, సైదులు ముదిరాజ్, ఈశ్వర్, సాయిలు, మంగళపల్లి రవి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## 20న పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ

- **జాన్‌వెస్లీ హాజరు**



**సైబరాబాద్ విశాలభారతి:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. సుందరయ్య జీవితాన్ని, భూ పోరాటాలు, రైతాంగ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను నేటి తరానికి పరిచయం చేసేందుకు, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎస్వీకే ట్రస్ట్ ఈ సభను నిర్వహిస్తోంది.ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగే ఈ సభకు సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా హాజరై సుందరయ్య పోరాట స్ఫూర్తిపై ప్రసంగిస్తారు. ఎస్వీకే ఇన్‌చార్జి పి. ప్రభాకర్ ఆహ్వానం పలుకుతారు. సభలో భాగంగా విప్లవ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సుందరయ్య రచనలు, ఉద్యమ ఛాయాచిత్రాల ప్రదర్శన కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి

- **బీబీ నగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య చికిత్సలు**
- **సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్**




**నిజామాబాద్, విశాలభారతి:** ఇందూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులు అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దన్నారు. ప్రభుత్వపరంగా అనేక ఆసుపత్రులు ఉత్తమ చికిత్సలు అందజేస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన చికిత్స అందుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. * కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ లో ఏర్పాటుచేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక చికిత్సలను అందజేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే నిమ్స్ లోనూ చికిత్స కోసం ఎల్వోసీ అవసరమైతే తమ వద్ద కు రావాలన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల బిల్లులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాధితులు దరఖాస్తు చేసుకున్న వాటిలో వారు 60 శాతం పైగా ఇవ్వాలని కోరారు. అనంతరం మొత్తం 97 మంది లబ్ధిదారులకు రూ.21,43,000 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మఠం పవన్, ఎర్రం సుధీర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జా ముఠాపై మావల పోలీసులు ఉక్కుపాదం

- **మరొక నిందితురాలు అరెస్ట్**
- **నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం**
- **నిందితురాలు మాజీ కౌన్సిలర్ భార్య**
- **మావల సీఐ కర్ర స్వామి**



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీ ప్రాంతంలో ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకొని భూ కబ్జాలు, నకిలీ పత్రాల సృష్టి, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ముఠాపై మావల పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో భాగంగా షబానున్నీసా (36) అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని మావల సీఐ కర్ర స్వామి తెలిపారు. రుయ్యాడి గ్రామానికి చెందిన దొనకొండ బేబీతాయ్ ఫిర్యాదు మేరకు, ఆమెకు చెందిన ప్లాట్ నెం.49, 50లను నకిలీ మున్సిపల్ రికార్డులు, కట్టుకథల లింక్ డాక్యుమెంట్లతో అక్రమంగా ఆక్రమించి, అసలు యజమానులను బెదిరించినట్లు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో మాజీ కౌన్సిలర్ పైక్ రావు ఆనంద్, సద్దాం హుస్సేన్, లంబిలే సంతోష్, బోదకుంట రాజు, షేక్ షాదుల్లా తదితరులు ఖాళీ స్థలాలను గుర్తించి, నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. మావల ఇన్‌స్పెక్టర్ కె. స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో, శ్రీ నిలయం అపార్ట్‌మెంట్ వద్ద షబానున్నీసాను అదుపులోకి తీసుకుని విచారించగా, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాల తయారీలో తన పాత్రను అంగీకరించింది. ఆమె వద్ద నుంచి డాక్యుమెంట్ నెం.5685/2023కు సంబంధించిన నకిలీ సేల్ డీడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించి మరికొందరు నిందితులు ఇదివరకే అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్నారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల ధృవీకరించిన రికార్డుల ఆధారంగా బాధితుల అసలు యాజమాన్యాన్ని పోలీసులు నిర్ధారించారు. మావల, కేఆర్‌కే కాలనీ పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు తమ ఆస్తులను తరచుగా పరిశీలించుకోవాలని, ఈసీ మరియు మున్సిపల్ రికార్డులను తనిఖీ చేసుకోవాలని సూచించారు. భూ కబ్జాలు, నకిలీ పత్రాలు, బెదిరింపులకు గురైన వారు భయపడకుండా మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## నీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు



- **అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**
- **అవసరమైతే ప్రైవేట్ బోర్లు, అదనపు ట్యాంకర్లు మొగదాల పావని రమేష్ గౌడ్ చైర్పర్సన్**

**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక ఆర్‌డిఓతో కలిసి వార్డుల వారీగా తాగునీటి సమస్యలపై కౌన్సిలర్లతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులలో సమానంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని సూచించారు.నీటి ఎద్దడి తలెత్తకుండా కమిషనర్,ఏఈ మరియు క్షేత్రస్థాయిలోని వాటర్ మెన్లతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ..చౌటుప్పల్ పట్టణంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని వార్డుల్లో సమృద్ధిగా నీరు ఉన్న బోర్లను గుర్తించామని తెలిపారు.అవసరమైన చోట ప్రైవేట్ బోర్లను లీజుకు తీసుకోవడం జరిగిందని, అదనంగా మరో 6 నీటి ట్యాంకర్లను కూడా లీజుకు తీసుకుని ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ...అదనపు కలెక్టర్ ఆదేశానుసారం ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలు తీసుకుంటూ ప్రజలకు నీటి కొరత లేకుండా మా టెక్నికల్ టీం, వాటర్ మెన్ లతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, అందరూ వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్ఓ అంజయ్య, ఏఈ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, టీడబ్ల్యూఐ సంతోష్ కుమార్, వాటర్ మెన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాన్యుల పాలిట మోదీ సర్కార్ నిర్ణయాలు శాపం



- **ఇంధన ధరల పెంపుతో ప్రజలపై మరింత భారం - ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
- **దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరం మరోసారి గుర్తుకొస్తోందని వ్యాఖ్య**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, సామాన్యులను ఆర్థికంగా అణిచివేసే విధంగానే గత పదేళ్లుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. మత విద్వేషాలు, జాతీయవాదాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, అనంతరం ప్రజలపై భారాలు మోపుతూ పేదల పాలిట శాపంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంపై స్పందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఇప్పటికే ధరల భారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇంధన ధరల పెంపు మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది అని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ధరల పెంపుపై మౌనం పాటించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. దేశ ప్రజలను బంగారం కొనొద్దని, ఖర్చులు తగ్గించుకోవాలని, వాహనాల వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని సూచించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలు ఈ స్థితికి ఎందుకు వచ్చారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాల క్రితం దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మరియు మాజీ ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ తీసుకున్న సంస్కరణలే నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలిచాయని గుర్తు చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవడంతో దేశం ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిందని మల్ రెడ్డి ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వ కాలంలో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాలపై పెనుభారం మోపుతున్నారని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజలకు పారదర్శకమైన, సంక్షేమ పాలన అందుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వ అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయని ఆయన అన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

- **మహిళా సమాఖ్య డిమాండ్**



**బోడుప్పల్ విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్ 10 వ, డివిజన్ భగత్ సింగ్ నగర్ కాలనీలో మహిళా సమాఖ్య కార్యదర్శి సిహెచ్ మాధవి ఆధ్వర్యంలో బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ఈ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిహెచ్ మాధవి మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడు అయినా బండి భగీరథపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పాక్షికంగా విచారణ జరిపి, నిజాలు బయటపెట్టి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ, "చట్టం ముందు అందరూ సమానమే. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి, చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదు" అని పేర్కొన్నారు. అదేవిధంగా, బాధిత కుటుంబానికి పూర్తి భద్రత కల్పించి, సంఘటనపై పారదర్శక విచారణ జరపాలని మహిళా సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నవారు జి రాజమ్మ, పద్మ, నాగమణి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చమురు ధరల పెంపు పేదలపై ఆర్థిక యుద్ధమే

- **సీపీఐ నేత టి.రామకృష్ణ**



**సైబరాబాద్, విశాలభారతి:** పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు టి.రామకృష్ణ మండిపడ్డారు. నిరుద్యోగం, ధరల భారంతో ప్రజలు అల్లాడుతుంటే ఇంధన ధరల పెంపు నడ్డి విరిచే చర్య. పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసరాల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రైతులు, ఆటో కార్మికులు, లారీ డ్రైవర్లు, చిన్న వ్యాపారులు సంక్షోభంలోకి నెట్టబడ్డారు" అని ఆయన తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో తగ్గించకుండా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని రామకృష్ణ ఆరోపించారు. "పన్నుల రూపంలో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటూ కార్పొరేట్ మిత్రులకు మేలు చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంవిమర్శించారు.పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థినుల భద్రతకు 'సురక్ష కవచ్' హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సిపి రమేష్

**సైబరాబాద్ విశాలభారతి:** సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినుల భద్రత, మానసిక క్షేమం, మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించేందుకు 'సురక్ష కవచ్ - కాలేజ్ గర్ల్స్ సేఫ్టీ & వెల్‌బీయింగ్ హ్యాండ్‌బుక్'ను శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థుల నేతృత్వంలోనే క్లబ్‌లు ఏర్పాటు చేసి బాధ్యతాయుతమైన క్యాంపస్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ ఐపీఎస్ మాట్లాడుతూ, యువతలో ఒత్తిడి, ఒంటరితనం, మాదక ద్రవ్యాల వ్యసనాన్ని అరికట్టేందుకు బహిరంగ సంభాషణ, భావోద్వేగ క్షేమం, క్రమశిక్షణ అవసరమన్నారు. డ్రగ్ నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని, సమస్యలుంటే విద్యార్థులు స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో బహిరంగంగా చర్చించాలని సూచించారు. బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీ వరలక్ష్మి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, అవగాహన కార్యక్రమాలతో పాటు చర్చా వేదికలు కూడా ముఖ్యమని సీపీ పేర్కొన్నారు.నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ, వ్యసనం, పీర్ ప్రెజర్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, సురక్ష కవచ్ వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ, క్యాంపస్‌లలో మానసిక ఆరోగ్య మద్దతు, యాంటీర్యాగింగ్ చర్యలు తప్పనిసరి అన్నారు.ఎస్సీఎస్సీ డైరెక్టర్ రష్మి శ్రీవాస్తవ సేఫ్టీ, వెల్‌నెస్ క్లబ్‌ల అమలుపై విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలు సేకరించారు. పాఠశాల' యువ బృందం ఓపెన్ సింగింగ్ సెషన్ నిర్వహించగా, వందేమాతరం, జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో సీపీ రమేశ్, డీసీపీ సృజన, రాహుల్ రవీంద్రన్, ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, వనితా దట్ల, చేతనా కాసం, శ్రీవిద్యారెడ్డి, వైశాలి సాగర్, రష్మి శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

## బేటీ బచావో' నినాదమా? బేటీని బలి చేసే రాజకీయమా?

- **అధికారంలో ఉన్నోడి కొడుకైతే చట్టం వంగి సలాం కొడుతుందా?**



ఎర్రోళ్ల అంజి
బిఎస్ఎఫ్ ప్రెసిడెంట్, సెంట్రల్ వర్సిటీ

**సైబరాబాద్ విశాలభారతి:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరత్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై హైదరాబాద్ విశ్వవిద్యాలయ బీఎస్ఎఫ్ అధ్యక్షుడు అంజి ఎర్రోళ్ల తీవ్రంగా స్పందించారు. చిన్నారిపై లైంగిక దాడి సమాజ మానవత్వంపై జరిగిన దాడి అని ఆయన మండిపడ్డారు. "ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలన్న చర్చ కంటే, నిందితుడిని కాపాడే రాజకీయ ప్రయత్నాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సామాన్య కుటుంబానికి చెందినవాడైతే పోలీసులు, మీడియా, నేతలు ఇదే రీతిలో వ్యవహరించేవారా? సమాధానం ప్రజలందరికీ తెలుసు" అని అంజి ఎర్రోళ్ల వ్యాఖ్యానించారు. దళితబహుజన సమాజం అధికారంలో ఉన్నవారు, ఆర్థికంగా బలమైనవారు చేసిన నేరాల్లో కూడా బాధితులే చివరకు నిందితులుగా మారే పరిస్థితులను చూసిందని ఆయన గుర్తుచేశారు. "నా కొడుకుపై ఆరోపణలు రావడం రాజకీయ కుట్ర అని చెప్పడం అధికార అహంకారమే. ఒక చిన్నారి ఫిర్యాదు చేసే ముందు ఎంత మానసిక వేదన అనుభవిస్తుందో అధికారంలో ఉన్నవాళ్లు ఆలోచిస్తారా?" అని ప్రశ్నించారు. కథువా, ఉన్నావ్ రేప్ కేసులు, మహిళా రెజ్లర్ల ఆందోళన సమయంలో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, "ఒకవైపు 'బేటీ బచావో' అంటూనే మరోవైపు బాధితులే నిందితుల్లా నిలబడే పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలో ఈ ధోరణి మరింత బహిరంగంగా కనిపిస్తోంది" అని విమర్శించారు. "పోక్సో చట్టం పుస్తకాల్లో ఉంటే సరిపోదు. బలహీనుడి గొంతు వినిపించాలి, నిందితుడు ఎంత పెద్దవాడైనా చట్టం ముందు తలవంచాలి. అదే డాక్టర్ అంబేద్కర్ కోరుకున్న సమానత్వం. నేడు అధికారవంతులకు ముందస్తు బెయిల్లు, రాజకీయ రక్షణలు; సామాన్యులకు మాత్రం అరెస్టులు, బెదిరింపులు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

- **రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి**
- **ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు**



**నిజామాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజా సేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1)బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)b కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పీలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నల్ల చెరువులో పడిపోయి రైతు దుర్మరణం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలంలోని మదనపల్లి కొత్త తాండ గ్రామ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నల్ల చెరువులో మునిగి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు కొర్ర సేత్య (83), వృత్తిరీత్యా రైతు. ఆయన బుధవారం (13.05.2026) రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన తరువాత, గురువారం ఉదయం ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు ఆయన సాధారణంగా వెళ్లే శనేశ్వర స్వామి గుడికి వెళ్లి ఉంటారని భావించారు. అయితే తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం (15.05.2026) ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో మృతుడి బంధువు కొర్ర భాస్కర్ పొలం వద్దకు వెళ్తుండగా, గ్రామంలోని నల్ల చెరువు వద్ద ప్రజలు గుమిగూడి ఉండటాన్ని గమనించాడు. అక్కడికి వెళ్లి చూడగా చెరువులో నుంచి బయటకు తీయబడిన మృతదేహం కొర్ర సేత్యదేనని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు తరచూ మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మద్యం మత్తులో చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోవడంతో మృతి చెందినట్టు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్

- **మణుగూరు డిఎస్పి వంగా రవీందర్ రెడ్డి**



**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు పట్టణంలో డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో మణుగూరు డిఎస్పి ఆధ్వర్యంలో డివిజన్లోని నాలుగు మండలాల సిఐలు ,ఎస్ఐల తోపాటు 50 మంది పోలీస్ సిబ్బంది తో కార్డునెంట్ సెర్చ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు, సరైన సర్టిఫికెట్లు లేని 80 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను పోలీసులు గుర్తించి వాహనదారులకు ఫైన్లు వేసారు, మూడు దుకాణాల్లో అక్రమంగా నిలువుంచిన సుమారు 80 వేల రూపాయల విలువగల మద్యం బాటిల్లను సీజ్ చేసారు. పోలీసులు ఈ సందర్భంగా డి.ఎ.స్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం ప్రజలను అప్రమత్తం చేయడమే అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు, సైబర్ క్రైమ్ మోసాల పట్ల ప్రజలకు వివరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# బిఆర్ఎస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన రేగా కాంతారావు

- **రాబోయేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే**



**విశాలభారతి, కరకగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, పినపాక అభివృద్ధి ప్రదాత శ్రీ రేగా కాంతారావు ప్రారంభించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు ముద్దం సాంబయ్య అధ్యక్షతన, మండల అధ్యక్షుడు రావుల సోమయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ కార్యాలయం ప్రారంభం కావడం శుభపరిణామమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భేదాభిప్రాయాలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేస్తూ బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరోనా పరిస్థితుల్లో కూడా రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేసి రైతుబంధు, రైతుభీమా, పింఛన్లు సకాలంలో అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు రైతుబంధు, రైతుభీమా, పింఛన్లు సకాలంలో అందకపోవడమే కాకుండా వడ్ల కొనుగోలులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. యూరియా కట్టలపై యాప్ విధానం తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీకి ఎదురైన పరిస్థితులే త్వరలో తెలంగాణలో కూడా ఎదురుకానున్నాయని అన్నారు. బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి వెంకటరెడ్డి, బైరిశెట్టి చిరంజీవి, కొమరం రాంబాబు, సర్పంచ్ బట్టలు సందీప్, ఉపసర్పంచ్ బుడగం రాము, ఉప్పల శ్రీధర్, ముద్దం సతీష్, ఉప్పల ఆదినారాయణ,ఓర్సు సత్యనారాయణ, కుంటిగొర్ల వెంకన్న, బిర్ర విష్ణు, ఏగ్గడి భాస్కర్, కుంచం వీరన్న, గవిని లింగయ్య , సుర మధు , కరకాపల్లి శ్రీను ఈసం నాగమణి, ఉప్పలి కాంతారావు ,ఓర్సు భాస్కర్, ఉప్పలి సాంబశివరావు, ఈసం శంకరయ్య ,శివరాత్రి సాంబశివరావు, తోలేం రాంబాబు, లక్ష్మీరాయణ, ప్రభాకర్, శ్రీదేవి , సోషల్ మీడియా వారియర్స్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మానం

**పాల్వంచ, విశాలభారతి:** విద్యా వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మధుబాబు అధ్యక్షతన శుక్రవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మూర్తి, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ యస్ సుగుణ, జడ్.పి.హెచ్.ఎస్ బొల్లోరు గూడెం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి. భవాని శేఖర్ మరియు స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ కరస్పాండెంట్ జి. భాస్కర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల మేధో వికాసానికి లైబ్రరీలు ఎంతో దోహదపడతాయని, నేటి తరం విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడంతో పాటు, పఠనాసక్తిని పెంపొందించేందుకు నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. అనంతరం ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినులు సిహెచ్ హరిత 521 మార్కులు జడ్.పి.హెచ్.ఎస్ బొల్లోరు గూడెం, స్టార్ చిల్డ్రన్ హై స్కూల్ కు చెందిన గుమ్మళ్ల జయలేఖ 568 మార్కులు, గంగుల ఈషితా శ్రీ రెడ్డి 521 మార్కులను అతిథులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,ఉద్యోగార్దులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం



- **రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
- **మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**
- **రాష్ట్రవ్యాప్తంగా రైతుల భారీ హాజరు**
- **పామాయిల్ సాగు విస్తరణపై మంత్రి దిశానిర్దేశం**
- **హార్టికల్చర్ కళాశాలతో కొత్త అవకాశాలు**

**అశ్వారావుపేట, విశాలభారతి :** అశ్వారావుపేట అభివృద్ధికి జీవితాంతం కట్టుబడి ఉంటానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాలను ప్రారంభించిన అనంతరం అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ బృందాల నృత్యాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు, గిరిజన మహిళల హారతులతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. అనంతరం రైతులు మంత్రికి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ప్రత్యేక డిజిటల్ ప్రదర్శన రూపంలో సభలో ప్రదర్శించారు. ప్రజా జీవితం, రైతు సంక్షేమం కోసం చేసిన పోరాటాలు, సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల అభివృద్ధి, విద్యాసంస్థల ఏర్పాటు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలను వీడియో రూపంలో ప్రదర్శించగా రైతులు, ప్రజలు హర్షధ్వానాలతో అభినందించారు. సభలో ప్రసంగించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భావోద్వేగానికి లోనయ్యారు. “గత 50 సంవత్సరాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా నన్ను రాజకీయంగా నడిపించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనం చేస్తున్నాను. ప్రజల ఆశీస్సులు లేకపోతే నేను ఈ స్థాయికి చేరుకునే వాడిని కాదు. జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటాను” అని అన్నారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, ప్రజల ప్రేమ, ఆదరణ శాశ్వతమని పేర్కొన్నారు. అభివృద్ధే తన రాజకీయ జీవిత ధ్యేయమని స్పష్టం చేసిన మంత్రి, ఒకప్పుడు సైకిల్ కూడా వెళ్లలేని రహదారులపై నేడు ఆధునిక వాహనాలు తిరుగుతున్నాయంటే అది ప్రాంత అభివృద్ధికి నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సాగునీరు, రహదారులు, విద్య, వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు చేరువ కావడం వల్లే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జీఓ నెంబర్-3 కీలకపాత్ర పోషించిందని, ఆ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. గిరిజన యువత చదువులో, ఉపాధిలో ముందుకు రావాలని కోరారు. అశ్వారావుపేట ప్రాంత వ్యవసాయ సామర్థ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన మంత్రి, “భారతదేశంలో ఎక్కడ పండే పంట అయినా అశ్వారావుపేటలో పండుతుంది. ఇక్కడి నేల ఎంతో సారవంతమైనది. రైతులు కష్టపడే స్వభావం కలిగిన వారు” అని కొనియాడారు. రైతుల ఆదాయం పెంచడం కోసం శాస్త్రీయ వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు, మార్కెట్ ఆధారిత వ్యవసాయ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు వెనుక ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరిస్తూ యువతకు ఆధునిక వ్యవసాయ విద్య అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కళాశాలలో పరిశోధనలు, ప్రాక్టికల్ శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు ఉపయోగపడే కొత్త విధానాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రపంచ మార్కెట్ లో ఏ పంటకు అధిక డిమాండ్ ఉంటే రైతులు ఆ పంటను సాగు చేయాలని మంత్రి సూచించారు. మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగు చేస్తే రైతులు ఆర్థికంగా మరింత బలపడతారని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని, రైతులకు నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట ప్రాంతాన్ని వ్యవసాయ రంగంలో ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని, ఉద్యానవన కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత భవిష్యత్తును మార్చే కీలక అడుగని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభలో పాల్గొన్న ఆయిల్ ఫెడ్ అధికారులు ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని వివరించారు. పామాయిల్ సాగులో ఆధునిక పద్ధతులు, దిగుబడి పెంపు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పలువురు రైతులు తమ అనుభవాలను సభలో పంచుకొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ ఫెడ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, గిరిజన నాయకులు, వివిధ గ్రామాల రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలి: సిపిఎం

- **పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్**
- **బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి**
- **హనీ ట్రాప్ కేసును ఎత్తివేయాలని ఆందోళన**




**సత్తుపల్లి, విశాలభారతి :** సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బండి సాయి భగీరథను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఆరోపణలతో పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం ఆందోళనకరమన్నారు. బాధిత కుటుంబంపై హనీ ట్రాప్ పేరుతో రివర్స్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పలుకుబడితో కేసును పక్కదారి పట్టించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ కేసులో హోంశాఖ, డీజీపీ, మహిళా కమిషన్ కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని, బాలికపై నమోదు చేసిన హనీ ట్రాప్ కేసును ఎత్తివేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అలాగే బాధితురాలు, ఆమె కుటుంబానికి పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, లక్ష్మీనారాయణ, భాస్కర్, జిలాని, రఫీ, రాధాకృష్ణ, నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవి, వెంకటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలకు ఘన సన్మానం

- **రాష్ట్ర స్థాయి పామాయిల్ సదస్సులో కాంగ్రెస్ నాయకుల సత్కారం**
- **అశ్వారావుపేటలో ఘనంగా పామాయిల్ సదస్సు**
- **తుమ్మలను శాలువాలు, పూలమాలలతో సన్మానించిన నేతలు**
- **పామాయిల్ సాగు విస్తరణపై మంత్రి వివరణ**



**అశ్వారావుపేట, విశాలభారతి :** అశ్వారావుపేటలో రాష్ట్ర స్థాయి పామాయిల్ సదస్సు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల అభివృద్ధి, పామాయిల్ సాగు విస్తరణ, వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి వివరించారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పామాయిల్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సదస్సు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. జల్లిపల్లి దేవరాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సదస్సులో వ్యవసాయ నిపుణులు, అధికారులు, రైతులు పాల్గొని పామాయిల్ సాగులో ఆధునిక పద్ధతులు, దిగుబడి పెంపు, మార్కెట్ అవకాశాలపై చర్చించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# రేపు నీటి సరఫరాకు అంతరాయం



**విశాలభారతి, కరకగూడెం:** మణుగూరు లారీ ఆఫీస్ వద్ద DI 600 ఎంఎం ప్రధాన పైప్లైన్ డైవర్షన్ పనులు చేపడుతున్నందున శనివారం పలు మండలాలు, గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కరకగూడెం ఎంపీడీఓ దేవా వర కుమార్ తెలిపారు. మణుగూరు మండలంలోని తీర్లపురం, పగిడేరు, రామానుజవరం, దమ్మక్కపేట, సాంబాయిగూడెం, గుట్టమల్లారం, కట్టుమల్లారం పంచాయతీలతో పాటు పినపాక, కరకగూడెం, అల్లపల్లి, గుండాల మండలాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

# గౌతమికి పరామర్శ.. పండ్లు అందజేత

**చిన్నగూడూరు మండల బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు బాదావత్ సురేష్**



**చిన్నగూడూరు విశాల భారతి ):** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మేగ్యాతండా గ్రామానికి చెందిన బాదావత్ గౌతమి భర్త సిరి ఇటీవల చిన్న సర్జరీ చేయించుకోవడంతో, ఆమెను చిన్నగూడూరు మండల బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు బాదావత్ సురేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పండ్లు అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గూగులోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా గౌతమి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



**డోర్నకల్ మరిపెడ విశాల భారతి:** మరిపెడ నుండి ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, మహబూబాద్ జిల్లాలకు పోయేటందుకు రహదారుల సౌకర్యం కలిగి ఉండడంతో అక్రమ వ్యాపారాలు దర్జాగా సాగుతున్నాయి. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని అంగన్వాడి టీచర్లకు, ఆశ వర్కర్లకు కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఊరికి చివరగా ఉండటంతో అక్రమ వ్యాపారం చేయడానికి సరైన ప్రదేశంగా గుర్తించి ఎంచుకున్నారు. డబల్ బెడ్రూమ్ సీరియల్ నెంబర్ 13, కంచుకట్ల నాగమణి ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యాన్ని నిల్వ చేసుకున్నారు.రెవెన్యూ అధికారులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఆ ప్రదేశాన్ని తనిఖీ చేయగా ఆ ఇంట్లో ఆక్రమంగా 230 బస్తాల వరకు నిలువ చేసి ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆర్ ఐ శరత్ చంద్ర,రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకొని సీజ్ చేశారు.అక్రమంగా నిల్వ చేసి ఉంచిన రేషన్ బియ్యాన్ని ట్రాక్టర్ ద్వారా గుండెపుడి గోదాంకు తరలించారు. అక్రమ రేషన్ ఎవరిదో కనుక్కొని వారిపై కేసు నమోదు చేస్తామని తెలియచేసిన సంబంధిత అధికారులు.

# తుడుం దెబ్బ ఐక్యత సభను విజయవంతం చేయండి



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం పరిధి కృష్ణాపురం గ్రామం లో ఈ నెల 17న హనుమకొండలో జరిగే తుడుం దెబ్బ ఐక్యత సభ కరపత్రాలను తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తొర్రెమ్ సంతోష్,కార్య దర్శి చేప లక్ష్మణ్. కోశాధికారి వాసం సంతోష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల నాయకులు యాలం చిట్టిబాబు. మాట్లాడుతూ గిరిజన చట్టాలు అమలు కోసం ఆదివాసుల హక్కుల సాధన కోసం పోరాటం చేయవలసిన సమయం వచ్చిందన్నారు. హక్కులు రిజర్వేషన్ సంస్కృతి సాంప్రదాయాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు ఉద్యమించాలి . ప్రతి ఒక్కరు కొమరం భీమ్, సమ్మక్క సారక్క దేవత ఉద్యమ స్ఫూర్తిని తీసుకోవాలని. ఎస్టీ జాబితాల నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఉద్యమం చేస్తూనే భావితరాలకు మనం ఫలాలను అందించే వాళ్ళం అవుతామని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువత మరియు గ్రామ పెద్దలు కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు సొంతిల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- **మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని బంగారిగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో యండి పర్వీన్,యస్కే ఫరీన్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ యండి హన్నుబాయ్, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, షాదీ ఖానా చైర్మన్ ఎస్కే కరీం, కోఆప్షన్ సభ్యులు యండి బాబా షరీఫ్, యస్కే జానిబాబు, సందగళ్ల విజయ సతీష్, పస్తం గంగారాములు, షాదీ ఖానా మాజీ చైర్మన్ ఎండి ఎజాస్ పాషా, ఎండి ఇబ్రహీం, 20వ వార్డు అధ్యక్షులు ఉడుగు వెంకటేశం గౌడ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు యండి చోటే బాయ్, యండి వాహిద్, మిరియాల సునీత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# నూతన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశాలభారతి, గోదావరిఖని:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.రామగుండం లో నిర్మాణంలో ఉన్న 355 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రారంభంలో రూ.160.3 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.205 కోట్ల వ్యయం అవసరమవుతోందని తెలిపారు. అదనపు నిధుల మంజూరు కోసం సవరించిన అంచనాలతో ఇప్పటికే సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల మంజూరు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా సమన్వయం చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యపై కార్తిక్ రెడ్డి పాదయాత్ర



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మంచినీటి సమస్యపై నిరసనలు కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగీర్, కిస్మత్పూర్, హైదర్ షాకోట్ ప్రాంతాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో కిస్మత్పూర్లోని వివేకానంద విగ్రహం వద్ద నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ, వేసవికాలంలో అనేక రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలమండలి అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి ఇంటికి నిరంతరాయంగా మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ సర్కిల్ ఇంచార్జ్ రావు కోళ్ల నాగరాజ్, రవీందర్ రెడ్డి, ప్రేమ్ గౌడ్, నవీన్ ముదిరాజ్, తలారి పాండు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**



**విశాలభారతి , పెద్దపల్లి:** బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి జోన్ సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్జిల్లా సరిహద్దు చెక్పోస్టును రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేసి,వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు.సీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చెక్పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,ప్రతి వాహనం,పశువుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని,సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తెలిపారు.పండుగ సమయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సీపీ వెంట పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ,సుల్తానాబాద్ సీఐ రంజిత్,సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్రం వైఫల్యం – ఎన్టీఏను రద్దు చేయాలి

- **డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే డబుల్ లీకేజీ ప్రభుత్వమా?**
- **నీట్ పేపర్ లీక్పై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.**
- **టీపీసీసీ జనరల్ సెక్రటరీ, డాక్టర్స్ సెల్ : డా.వీరన్న నాయక్**



**మహబూబాబాద్ విశాల భారతి ):** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షలలో వరుసగా జరుగుతున్న అవకతవకలు దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ, డాక్టర్స్ సెల్ నాయకుడు డా. వీరన్న నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మే 3న దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఆరోపణలు వెలుగులోకి రావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన సుమారు 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని పేర్కొన్నారు. వరుసగా పరీక్షా పత్రాలు లీక్ అవుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. 2024లో కూడా నీట్ పరీక్షల నిర్వహణపై వివాదాలు తలెత్తిన విషయాన్ని గుర్తుచేస్తూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. “డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే డబుల్ లీకేజీ ప్రభుత్వమా?” అని ప్రశ్నించారు. 180 ప్రశ్నలలో 135 ప్రశ్నలు వరకు లీక్ అయ్యాయన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ను వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన కొత్త పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# రైతు ధాన్యానికి అడ్డంకులు లేకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు

- **మక్కజొన్న, ధాన్యం తరలింపుపై కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రత్యేక పర్యవేక్షణ**
- **రైస్ మిల్లర్లు, అధికారులు, పోలీసులతో సమన్వయ సమావేశాలు**
- **కేసముద్రంలో తహసీల్దార్ గుండు వివేక్ ఆధ్వర్యంలో కీలక ఆదేశాలు**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి ):** రైతులు పండించిన మక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు మరియు రవాణా ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా మక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించగా, వరి ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వల నిర్వహణ కోసం 18 మండలాలకు తహసీల్దార్లను ప్రత్యేక బాధ్యతలతో నియమించారు. గత రెండు మూడు రోజులుగా ధాన్యం తరలింపును వేగవంతం చేయడంపై జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ, రెవెన్యూ అధికారులు, మార్కెటింగ్ అధికారులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని గోదాములు, రైస్ మిల్లులకు త్వరితగతిన తరలించేలా చర్యలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లు, పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం తీసుకువస్తున్నారు. ధాన్యం నిల్వలు పెరగకుండా, వాహనాలు నిలిచిపోకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కేసముద్రం మండల పరిధిలోని రైస్ మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ గుండు వివేక్ సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి కిరణ్, మండల స్థాయి అధికారులు, జీపీఓలు హాజరయ్యారు. సమావేశంలో రైస్ మిల్లర్లకు పలు కీలక సూచనలు జారీ చేశారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను అదే రోజు అన్లోడ్ చేయాలని, ఆలస్యం చేయరాదని స్పష్టం చేశారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే సంబంధిత లారీల అక్నాలెడ్జ్మెంట్ను ఆన్లైన్ ఓపీఎంఎస్ పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యంలో నాణ్యత లోపాలు, తేమ శాతం సమస్యలు, తప్పు రకం ధాన్యం పంపిణీ వంటి అంశాలు గుర్తించిన వెంటనే సంబంధిత పీపీసీఎస్ సీఈఓలు, సెంటరింగ్ ఇన్చార్జీలు లేదా తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తేమ శాతం పరిశీలించకుండా ధాన్యాన్ని మిల్లులకు పంపి అక్కడ తిరస్కరణకు గురైతే సంబంధిత సెంటర్ ఇన్చార్జుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులతో నేరుగా ధాన్యం లోపాలపై చర్చించకుండా, సంబంధిత అధికారులతో మాత్రమే మాట్లాడాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. అలాగే అన్లోడింగ్ ప్రక్రియ వేగంగా సాగేందుకు అవసరమైన హమాలీ కార్మికులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు విధానం ఆలస్యం కాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇక వాహనాల డ్రైవర్లు మిల్లుల వద్ద లారీలు నిలిపి వెళ్లిపోవడం వల్ల అన్లోడింగ్ ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. డ్రైవర్లు మిల్లు వద్ద అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని, లేకపోతే మిగతా వాహనాల అన్లోడింగ్ కూడా ఆలస్యం అవుతుందని హెచ్చరించారు. రైతుల శ్రమ వృథా కాకుండా, కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు తార్పాల్, తాగునీటి సదుపాయం



- **ఎండల తీవ్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు**
- **కూలీలకు ఆటో సౌకర్యం కల్పించిన గ్రామ పంచాయతీ**

**విశాలభారతి అబ్దుల్లాపూర్ మెట్ :** ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలు ఎండల ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు తార్పాల్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. అదేవిధంగా కూలీలు పనిస్థలాలకు సౌకర్యవంతంగా వెళ్లేందుకు ఆటో సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ చర్యలతో కూలీలు కొంత ఉపశమనం పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి సునీత, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం అందించాలి

- **పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి**



**విశాలభారతి, అంతర్గం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ డీసీపీ బి. రామ్‌రెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ కృష్ణకుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిశుభ్రత,పరిసరాల నిర్వహణ,రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.అలాగే పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి వారి పనితీరు,విధుల నిర్వహణపై సమీక్ష చేపట్టారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలు, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కార స్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, బాధితుల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.ప్రజల్లో పోలీస్ శాఖపై భరోసా, విశ్వాసం,నమ్మకం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# ప్రియదర్శిని కాలనీలో వ్యక్తి అదృశ్యం

- **కుటుంబ కలహాల అనంతరం కనిపించకుండా పోయిన పండ్ల వ్యాపారి**
- **మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడుగు యాకూబ్ (55) తన భార్యతో కలిసి గత నాలుగేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం నగదు విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాగ్వాదం అనంతరం యాకూబ్ ఇంటికి వెళ్లిపోయాడని, సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న భార్యకు అతను కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురైనట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు.అదృశ్యమైన కడుగు యాకూబ్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. యాకూబ్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని హయత్‌నగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.


# కేంద్రంపై వాసిరెడ్డి నరేష్ ఫైర్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై టీపీసీసీ రాష్ట్ర సమన్వయకర్త వాసిరెడ్డి నరేష్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల వరకు ఒక విధంగా మాట్లాడి, అనంతరం ప్రజలపై భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటైందని ఆయన ఆరోపించారు. క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లకు చేరిందని చెప్పి ప్రజలను భయపెడుతున్న కేంద్ర ప్రభుత్వం గతాన్ని గుర్తు చేసుకోవాలని నరేష్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 150 డాలర్ల వరకు పెరిగినా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్‌ను రూ.60కు, డీజిల్‌ను రూ.45కు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి ప్రజలపై నిరంతరం ఆర్థిక భారం మోపుతూ దోపిడీ పాలన కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. దేశంలోని కొద్దిమంది కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. కరోనా సమయంలో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 40 డాలర్లకు పడిపోయినప్పటికీ, ఆ సమయంలో పెట్రోల్ ధరలను తగ్గించకుండా లాభాలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ ప్రయోజనాలకు కట్టుబడి పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని, ప్రజలను మోసం చేసే విధానాలే బీజేపీ అసలు స్వరూపమని వాసిరెడ్డి నరేష్ పేర్కొన్నారు.

# పిగ్లీపురం అభివృద్ధే లక్ష్యం

- **వీధి దీపాలు, ఐమాక్స్ లైట్లు, త్రీఫేజ్ కరెంట్ ఏర్పాటు చేసిన సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి**
- **గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి**





**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పిగ్లీపురం గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. గ్రామ ప్రజలు రాత్రి సమయంలో రాకపోకలకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ నుండి పిగ్లీపురం గ్రామం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. రాత్రి వేళల్లో చీకటి కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వెంటనే స్పందించిన సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా పిగ్లీపురం గ్రామంలోని ఎన్వీఎస్ నాయుడు కాలనీలో గతంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు గత పాలకుల నిర్లక్ష్యంతో పనిచేయకుండా ఉండటంతో, సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి తన సొంత ఖర్చుతో కొత్త ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయించారు. గ్రామంలో నెలకొన్న త్రీ ఫేజ్ కరెంట్ సమస్యను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించి పిగ్లీపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# జాతీయ జనాభా లెక్కల్లో ఓబీసీల ఊసేది?

**విశాలభారతి:** తెలంగాణ 'కుల సర్వే' సాక్షిగా దేశం ముందు నిలిచిన అసలు ప్రశ్న! భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. మన రాజ్యాంగం అందరికీ సమానత్వం, సామాజిక న్యాయం అందించాలని చెబుతోంది. కానీ, దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీలు) సంఖ్య ఎంత అన్నది ఇప్పటికీ ప్రభుత్వ లెక్కల్లో లేకపోవడం పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఎన్నికలు వచ్చినా, పథకాలు ప్రకటించినా 'ఓబీసీ'ల గురించే చర్చ. కానీ ఒక ప్రాథమిక ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు: "దేశంలో ఓబీసీల జనాభా ఎంత?" ఇది కేవలం నంబర్ల గొడవ కాదు... మెజార్టీ ప్రజల హక్కులు, అవకాశాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రశ్న.




### 1931 తర్వాత లెక్కలేవు!

మన దేశంలో చివరిసారిగా పూర్తిస్థాయి కులాల జనాభా లెక్కలు సేకరించింది బ్రిటీష్ కాలంలో, అంటే 1931లో. స్వాతంత్ర్యం వచ్చాక ఎస్సీ, ఎస్టీ జనాభాను మాత్రమే అధికారికంగా లెక్కిస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద వర్గమైన బీసీలపై కేంద్ర ప్రభుత్వం దగ్గర సరైన లెక్కలు లేవు. "ఇంత పెద్ద సామాజిక వర్గాన్ని అధికారికంగా దాచడం ఎంతవరకు న్యాయం?" అనే డిమాండ్ ఇప్పుడు ఊపందుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పార్లమెంట్‌లో ఈ విషయాన్ని గట్టిగా లేవనెత్తారు. "ఎవరి జనాభా ఎంతో తెలియకుండా, వాళ్లకు న్యాయం ఎలా చేస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగాలు, విద్య, బడ్జెట్ కేటాయింపుల్లో నిజమైన సామాజిక న్యాయం జరగాలంటే దేశవ్యాప్తంగా కుల గణన జరిగి తీరాలన్నది ఆయన వాదన. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇస్తూ కేంద్రం బిల్లు తెచ్చినప్పుడు కూడా ఈ చర్చ మరింత వేడెక్కింది. ఇందులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలొచ్చాయి. మహిళా సాధికారత అంటే కేవలం సీట్లు ఇవ్వడం కాదు, అందులోనూ సామాజిక న్యాయం ఉండాలనే డిమాండ్ వినిపించింది. కానీ, కేంద్రం ఎందుకు ఈ విషయంలో వెనుకాడుతోందన్న అంశంపై ఖచ్చితంగా సమాధానం చెప్పాలి. కులాల వారీగా లెక్కలు తీస్తే సమాజం విడిపోతుందనేది బీజేపీ వాదన. అయితే, అసలు జనాభా ఎంతో తేలితే... దేశంలోని రాజకీయం, ఆర్థికం, అధికారాల్లో ఎవరి వాటా ఎంత ఉందో, ఎవరి ఆధిపత్యం నడుస్తుందో స్పష్టంగా తెలిసిపోతుందనేది ప్రజాస్వామ్యవాదుల అభిప్రాయం.

### దేశానికి దిక్సూచిగా తెలంగాణ సర్వే-2024

గతంలో ఒక నినాదం దేశ రాజకీయాల్లో ప్రబలంగా ఉండేది. ఈరోజు బెంగాల్ ఏం చేస్తుందో... రేపు భారతం చేస్తుందన్నది. కానీ, నేడు దేశ రాజకీయ యవనికను తెలంగాణ నిర్దేశిస్తుంది. బీసీల కులగణన విషయంలో... తెలంగాణ, యావత్ దేశానికి మార్గదర్శిగా నిలిచింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 2024లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే" దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. ఇటీవల (2026 ఏప్రిల్‌లో) విడుదలైన ఈ నివేదిక ప్రకారం... తెలంగాణ జనాభాలో బీసీలు ఏకంగా 56.34% నుంచి 56.36% వరకు ఉన్నారు. ఇందులో బీసీ ముస్లింలు 10.08% గా ఉన్నారు. ఈ లెక్కలతో తెలంగాణలో బీసీలే అతి పెద్ద సామాజిక వర్గమని అధికారికంగా తేలిపోయింది. ఈ సర్వేతో ఎన్నో విషయాలు తెలిశాయాయి. "సామాజిక న్యాయం జరగాలంటే... ఖచ్చితమైన సమాచారం (డేటా) ఉండాలి. కేంద్ర ప్రభుత్వం వెనుకాడుతున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం ధైర్యంగా ఈ సామాజిక వాస్తవాలను ప్రజల ముందు పెట్టింది. బీసీలు ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ... రాజకీయ, ఆర్థిక రంగాల్లో వారికి దక్కాల్సిన వాటా ఇంకా రాలేదని ఈ సర్వే నిరూపించింది.

### ఓబీసీ లెక్కలు లేని జనగణన... 'అంధ గణన'!

**ఓబీసీలను లెక్కించకుండా దేశంలో జనాభా లెక్కలు సేకరిస్తే దానికి అర్థమే లేదు. అది సమాజ రూపురేఖలను పూర్తిగా చూపించలేదు. అసమానతలను, వెనుకబాటుతనాన్ని దాచిపెట్టే ఈ ప్రక్రియను 'అంధ గణన' (గుడ్డి లెక్కలు) అనక తప్పదు. "సామాజిక న్యాయం లేని రాజకీయ ప్రజాస్వామ్యం అసంపూర్ణం" అని బాబాసాహెబ్ అంబేద్కర్ నాడే చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు... దేశంలో తమ ఉనికిని గుర్తించడం, జనాభా ప్రకారం వాటా పొందడం కూడా. తెలంగాణ లాంటి ఒక రాష్ట్రం కుల సర్వే చేయగలిగినప్పుడు... కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన ఎందుకు చేయలేకపోతోంది? దేశం ఓబీసీలను కేవలం 'ఓటర్లు'గానే చూస్తుందా, లేదా 'భాగస్వాములు'గా గుర్తిస్తుందా? మెజార్టీ ప్రజలను లెక్కల్లో చూపించని వ్యవస్థకు సమానత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ఉంటుందా?**

**- డాక్టర్ లోలపు తిరుపతి, పాలసీ ఎనలిస్ట్**

## ఆర్జీయూకేటీ బాసరలో ఘనంగా విద్యా వారోత్సవాలు

# విద్యార్థులకు 100 లాప్‌టాప్‌ల అందజేత



**విశాలభారతి, బాసర :** రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం బాసరలో శుక్రవారం నిర్వహించిన విద్యా వారోత్సవాల ఐదవ రోజు కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. విశ్వవిద్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తమ కుటుంబాలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

**సిబ్బందికి రాగి జావ పంపిణీ**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఉదయం ఎస్‌ఏసీ ఆవరణలో సిబ్బందికి ఆరోగ్యదాయకమైన రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఏ. గోవర్ధన్, ఓఎస్డీ ఈ. మురళీ దర్శన్ పాల్గొని సిబ్బందికి జావ అందజేశారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

**విద్యార్థుల కోసం 100 లాప్‌టాప్‌ల వితరణ**

మధ్యాహ్నం యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ (VSEZs & EOUs), జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్. భవాని శ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీబీఎస్ టెక్నాలజీ సర్వీసెస్ సహకారంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన 100 లాప్‌టాప్‌లను విద్యార్థుల అవసరాల కోసం యూనివర్సిటీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా భవాని శ్రీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చేరువైతే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధి అనురాధ పుల్ల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, బాసర విద్యార్థులకు తోడ్పడడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారులు వి. సుధాకర్, పి.వి. జై కిరణ్, డీబీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డా. కొత్తపల్లి రాములు, డా. ఆర్. అజయ్ కుమార్, డా. బి. బాలకృష్ణ పద్య పఠనం చేయగా, బి. వజ్రాంశు, సురేష్ వీణ వాయిద్యంతో అలరించారు. కె. స్రవంతి, బసవ శేఖర్, రాయల సతీష్, డా. జి. శంకర్, శ్రీలక్ష్మి గాన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భార్గవ్, నవీన్ కుమార్, డా. వెంకటరమణ, నాగలక్ష్మి బృందాల నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. వైస్ ఛాన్సలర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ వారోత్సవాల ద్వారా సిబ్బందిలోని ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు, దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'పెద్ది' ప్రమోషన్లకు

# జాన్వీ దూరం

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఇప్పటివరకు భారీ కమర్షియల్ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన జాన్వీ, ఇప్పుడు తన ఫోకస్‌ను తెలుగు సినిమాలపై ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చి బాబు సన తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లలో ఆమె లుక్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.తాజాగా ఓ ప్రముఖ దినపత్రిక ప్రచురించిన కథనం ప్రకారం, జాన్వీ కపూర్ 'పెద్ది' ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుందనే ప్రచారం జరుగుతోంది. భారీ రెమ్యూనరేషన్ కారణంగానే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని, సినిమాలో తన పాత్రకు అంత ప్రాధాన్యత లేదనే భావనతో ప్రమోషన్లలో పాల్గొనాలనే ఆసక్తి చూపడం లేదని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ వార్తలపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే, అది జాన్వీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే 'పెద్ది' వంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో ఆమెకు దక్షిణాదిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు దక్కే అవకాశం ఉంది.**



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.